విశాఖపట్టణం
ఆదివారం 15 మార్చి 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 50 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ముగ్గురు నేతల అరుదైన కలయిక



విజయవాడ పోరంకిలోని మురళి రిసార్ట్స్ లో శనివారం జరిగిన ప్రవాసాంధ్రుల ప్రతినిధి కోమటి జయరాం సన్మాన సభలో అనకాపల్లితో బంధం ఉన్న ముగ్గురు నేతలు ముచ్చట్లు పెట్టుకోవడం చూపరులకు ఆసక్తిగా మారింది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మధ్య ఎప్పుడు అగ్గి రాజుకునేది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తో కలిసి అనకాపల్లి మాజీ ఎంపీలు అయ్యన్న, గంటా ముచ్చట్లు చూసిన వారు ఈ ముగ్గురిని ఒకే ఫ్రేమ్ లో ఫోటో తీసేందుకు పోటీ పడ్డారు. ఈ ముగ్గురు ఎప్పుడూ ఇలానే వుంటారా... లేక కూటమి పొత్తు వరకేనా అనుకుంటున్నారు.

-(జయ జయహే బ్యూరో - విశాఖపట్నం )




## నిరంతర పర్యవేక్షణ

**17,962 మెట్రిక్ టన్నుల ఎల్ పీజీ నిల్వలు**
**గ్యాస్ సరఫరాకు ఎంటువంటి కొరత లేదు**
**మంత్రులు పయ్యావుల, అచ్చెం నాయుడు**
**గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష**


(అమరావతి - జయజయహే)

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఎల్‌పీజీ సరఫరాపై ప్రభుత్వం నిత్యం పర్యవేక్షణ చేస్తోంది. దీనిలో భాగంగా శనివారం సివిల్ సప్లైస్ భవన్‌లో పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి అచ్చెన్నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా అంశంపై విస్తృత చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈనెల 12వ తేదీ నాటికి ఎల్‌పీజీ నిల్వలు 17,962 మెట్రిక్ టన్నులుగా ఉన్నాయి. మొత్తం ఎల్‌పీజీ కనెక్షన్లు 161.19 లక్షలకు చేరాయి. ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా సరఫరా అంతరాయం లేదని అధికారులు స్పష్టం చేశారు. భారత్ వినియోగించే ఎల్‌పీజీలో 60 శాతం దిగుమతులు మాత్రమే. వాటిలో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారా వస్తాయి. ఈ నేపథ్యంలో రిఫైనరీలకు ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తి పూర్తి స్థాయిలో ..మిగతా 2లో

# మీరు బాగుండాలనే.. మా ఆకాంక్ష

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**
**మీరు ఓట్లు వేసారా.. లేదా అనేది చూడం**
**ఏజెన్సీలో 18 నెలల్లో 460 కి.మీ. రోడ్లు వేసాం**
**గిరిజన ప్రాంతాలకు రాకకు నాకేం భయం లేదు**
**నందిగరువులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**
**గిరిపుత్రులతో కలసి జనసేన ఆవిర్భావ వేడుకలు**

(అల్లూరి సీతారామరాజు జిల్లా - జయజయహే)



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అత్యంత మారుమూల గిరిశిఖర గ్రామమైన నందిగరువులో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, జనసేన పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలను ఆడంబరాలకు పోకుండా గిరిజన గూడెం మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'మాటా-మంతి' కార్యక్రమంలో ఆయన గిరిజనులతో నేరుగా ముచ్చటించి, దశాబ్దాలుగా వారు ఎదుర్కొంటున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. 70 ఏళ్లుగా సరైన బాట లేని నందిగరువు గ్రామానికి రూ. 2 కోట్లతో నిర్మించిన నూతన రోడ్డును ఆయన ..మిగతా 3లో

## పరిధి దాటి విచారణ చేసారు

దర్యాప్తునకు ఆటంకం చేసారు
బెయిల్ రద్దు ఉత్తర్వులు ఎలా ఇస్తారు
ఏసీబీ కోర్టు తీరుపై హైకోర్టు ఆగ్రహం

2

## గుడ్లుకు బ్యాడ్ టైం..!

భారీగా ధరల పతనం.. సగానికి సగం తగ్గుముఖం
రూ. 7.06 నుంచి రూ. 4.20కి చేరిక
పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

2

## కమర్షియల్ బుకింగ్స్ ఓకే

వాణిజ్య సిలిండర్ల సరఫరా ప్రారంభం
ఎల్‌పీజీ కొరత లేనే లేదు
ముందస్తు భయంతో 88 లక్షల బుకింగ్స్
పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ

2

## పరిధి దాటి విచారణ చేసారు

దర్యాప్తునకు ఆటంకం చేసారు
బెయిల్ రద్దు ఉత్తర్వులు ఎలా ఇస్తారు
ఏసీబీ కోర్టు తీరుపై హైకోర్టు ఆగ్రహం

2

## ఉపాధి హామీపై చిత్తశుద్ధి లేదు

18 లక్షల జాబ్ కార్డులను కూటమి తొలగింపు
బీజేపీని ఎదురించే సత్తా ఎవరికీ లేదు
వైఎస్ ఆశయాలకు జగన్, బాబు తూట్లు
పీసీసీ చీఫ్ వై ఎస్ షర్మిల వ్యాఖ్యలు
విశాఖలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర

3



## 23న మిట్టల్ స్టీల్‌కు శంకుస్థాపన

హాజరుకానున్న సీఎం బాబు, డిప్యూటీ సీఎం పవన్
ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

2





## మురికివాడలకు మహర్దశ

వెలంపేట, ఏఎస్ ఆర్ నగర్ లకు మోక్షం
ఆధునీకరణకు ప్రభుత్వం ప్రణాళికలు
భోగాపురం ఎయిర్ పోర్టు రోడ్లు పూర్తి ఖాయం
మాస్టర్ ప్లాన్ ప్రకారం అన్ని రహదారులు సిద్ధం
మున్సిపల్ మంత్రి పొంగూరి నారాయణ స్పష్టం

2

## చిల్లర కష్టాలకు చెక్

ఏటీఎంలో రూ.10, రూ.20, రూ. 50 నోట్లు
స్మాల్ వాల్యూ డిస్పెన్సర్స్ పేరిట పైలట్ ప్రాజెక్టు
ముంబైలో ట్రయల్స్ చేపట్టిన రిజర్వు బ్యాంక్

## 16 నుంచి ఒంటిపూట బడులు

2

# కేజీహెచ్ ఓపీ మాయాజాలం వెనుక మర్మం!

**ఆయన చేరిన 3 నెలల్లో వెయ్యి పెరగడానికి కారణం**
**'జయ జయహే' కథనాలపై రాజకీయ నేతల ఆరా**
**లీకులు ఇస్తున్న వారిపై నిఘా పెట్టిన యంత్రాంగం**

(జయ జయహే బ్యూరో చీఫ్ - విశాఖపట్నం )

గుట్టుగా సాగుతోన్న అవినీతి దందా కాస్త బయటకు ఎలా పొక్కుతుందో తెలుసుకునే యత్నంలో కేజీహెచ్ ఉన్నతాధికారి తలమునకలై ఉన్నారు. ఇప్పటికే తన వారందరినీ రంగంలోకి దించి మరీ ఈ వార్తలు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలుసుకునే పనిలో ఉన్నట్టు భోగట్టా. తనపై మరీ ఇంత దారుణంగా లీకులు ఇస్తున్న ఆ ఉద్యోగుల చిట్టా రాబట్టే పనిలో పడ్డారు. గత కొద్ది రోజులుగా 'జయ జయహే దిన పత్రిక'లో వస్తున్న వరుస కథనాలపై మల్లగుల్లాలు పడుతున్న కేజీహెచ్ అధికార యంత్రాంగం ఎట్టకేలకు లీకు వీరులను అడ్డుకునే యత్నంలో పడింది. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు అక్కడ జరుగుతున్న అవినీతి దందా అంతా బహిర్గతమేనన్న సంగతి అందరికీ తెలిసిందే. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తనను ఎవరూ చూడలేదన్న నానుడి మాదిరిగా కేజీహెచ్ అవినీతి భాగోతం ఏ ఒక్కరిని కదిపినా చాంతాడంత చెబుతారన్న సంగతి జగమెరిగిన సత్యం. ఆ మాత్రం దానికి ఉద్యోగులతో ఎన్ని సమావేశాలు పెట్టినా...ఎంత మందిని బతిమిలాడినా...ఆయన్ను పట్టిన అవినీతి భూతం అలా వెంటాడుతూనే ఉంటుందని అంతా అంటున్నారు.




**ఓపీ ఇలా ఎలా పెరుగుతుందో....!**

కేజీహెచ్‌కు నిత్యం 1800 నుంచి 2 వేల మంది వరకూ ఔట్ పేషెంట్లు వస్తుంటారు. అంతకు ముందు 2 వేల లోపు మంది మాత్రమే ఉండేవారు. అయితే ఇటీవల కాలంలో ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒఢిశా రాష్ట్రాల నుంచి పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో కేజీహెచ్ ఓపీలో రద్దీ పెరిగింది. అయితే కేజీహెచ్‌కు ఉన్నతాధికారి రాకముందు ఓపీకి ఆ లెక్కలుండేవి. ఆయన వచ్చిన మూడు మూడు మాసాల వరకూ అవే లెక్కలు. కానీ ఆయనేమనుకున్నారో ...ఏమో గానీ తన పని తీరు పట్ల జిల్లా కలెక్టర్ మెప్పు కోసం ఏకంగా వెయ్యి మంది అదనంగా వస్తున్నట్టు ఓపీ పెంచేశారు. అదెలా సాధ్యమంటే...జనరల్ మెడిసిన్‌కు వచ్చే రోగిని ఆయనకున్న బాధలు విన్న తర్వాత ఇతర విభాగాలు అంటే గుండె...నరాలు...ఆర్థో..ఇలా పలు విభాగాలకు సిఫార్సు చేస్తుంటారు. అయితే ఈయన వచ్చిన దగ్గర నుంచి ఆ సిఫార్సులకు కూడా ఓపీలు తీసుకోవడం వల్ల రోగుల సంఖ్యను గణనీయంగా పెంచేశారు. ఒక రోగికి అయిదారు ఓపీ టికెట్లు జారీ చేస్తుంటే...ఆ మాత్రం పెరుగుదల కనిపించదా అన్నది ఉద్యోగుల వాదన...దీని వెనుక పెద్ద ప్రణాళికనే రచించారు మన అయ్యవారు. గత కొన్నేళ్లుగా 2 వేలు దాటని ఓపీ తన హయాంలోనే భారీ ఎత్తున పెరిగిందని అందుకు తాను చేపడుతున్న చర్యలేనని అడిగిన వారికి...అడగని వారికీ గొప్పలు చెప్పుకుంటున్నారని తద్వారా తన కోర్కెలన్నీ ఎమ్మెల్యేలు...మంత్రులు...జిల్లా యంత్రాంగం ద్వారా నెర వేర్చుకుంటున్నారని కోడై కూస్తున్నారు. కేజీహెచ్ ప్రక్షాళన పేరిట పైశాచిక ఆనందాన్ని అనుభవించే సదరు అధికారిపై ఇప్పటికే ప్రభుత్వం వద్దకు అవినీతి నివేదికలు చేరినట్టు చెప్పుకుంటున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు కూడా కేజీహెచ్‌లో జరుగుతున్న దందాను పరిగణనలోకి తీసుకుని మరింత కూపీలాగుతున్నారని చెబుతున్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు...టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌లు ఇప్పటికే జయ జయహే ప్రచురిస్తున్న వార్తలపై నిజానిజాలు తెలుసుకున్నారని, అలాగే వాళ్లకు చెందిన ఉద్యోగుల ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారని వినికిడి.

For a pure tomorrow.. జయజయహే

# మురికివాడలకు మహర్దశ

### వెలంపేట, ఏఎస్ ఆర్ నగర్ లకు మోక్షం

### ఆధునీకరణకు ప్రభుత్వం ప్రణాళికలు

### భోగాపురం ఎయిర్ పోర్టు రోడ్లు పూర్తి ఖాయం

### మాస్టర్ ప్లాన్ ప్రకారం అన్ని రహదారులు సిద్ధం

### మన్సిపల్ మంత్రి పొంగూరి నారాయణ స్పష్టం

**(విశాఖపట్నం - జయజయహే)**



విశాఖ నగరంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ విఎమ్ఆర్డిఏ మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించి, భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు దాదాపు పూర్తి చేస్తామని,సీతమ్మధార , ఏఎస్ ఆర్ నగర్ లో మురికివాడను ఆధునీకరిస్తామని పేర్కొన్నారు.శనివారం ఆయన , భోగాపురం విమానాశ్రయం అనుసంధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను, విశాఖపట్నం సీతమ్మధారలోని ఉన్న ఏ ఎస్ ఆర్ నగర్ లోని మురికివాడ ప్రాంతాన్ని భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, బిఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ , జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు సీతమ్మధార ఏ ఎస్ ఆర్ నగర్ లోని మురికివాడ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ నివసిస్తున్న నివాసితులతో మాట్లాడుతూ వారికి కల్పించవలసిన అవసరాలు, మౌలిక సదుపాయాలు, ఎన్ని సంవత్సరాలు నుండి ఆ ప్రాంతంలో నివసిస్తున్నారని, వారి వృత్తులు మొదలైనవి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఈ ప్రాంతంలో 3.2 ఎకరాల స్థలంలో 200 కుటుంబాలతో 30 సంవత్సరాల నుండి కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నామని, మా ఇళ్లకు ఎటువంటి పట్టాలు లేవని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని మంత్రి దృష్టికి నివాసితులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి మాట్లాడుతూ ఏ ఎస్ ఆర్ నగర్ లోని మురికివాడ ప్రాంత ప్రజలు గత 30 ఏళ్ల నుండి నివసిస్తున్నట్లు తెలిపారని, వారు నివాసం ఉంటున్న భూమి కి ఎటువంటి పట్టాలు లేవని, కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ భూమి మా సొంతమని వారిని బెదిరిస్తున్నారని స్థానికులు వెల్లడించారని మంత్రి తెలిపారు. సీతమ్మధార ూూా= నగర్ లో మురికివాడను ఆధునీకరిస్తామని,ప్రైవేటు భూమిలో ఏళ్ళతరబడి సుమారు 200 కుటుంబాలు తాత్కాలిక ఇళ్ళు, షెడ్ లు నిర్మించుకుని నివసిస్తున్నారని, ఇళ్లు తొలగిస్తామని అధికారులు,స్థలం యజమానులు బెదిరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారని, భూమి యజమానులతో మాట్లాడి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ఇదే ప్రాంతంలో పిపిపి పద్ధతిలో ఇల్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఎవరైతే ఈ భూమి మా సొంతం అంటున్నారో వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి అవసరమైన చర్యలు నివాసితులకు , ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కార మార్గం చూపే చర్యలు చేపట్టాలని కమిషనర్ కు మంత్రి సూచించారు. అనంతరం నేరెళ్ళ వలస నుంచి కొత్తవలస,బోయపాలెం నుంచి కాపులుప్పాడ,భీమిలి నుంచి దొరతోట జంక్షన్ కి వెళ్ళే రోడ్లు పరిశీలించారు. భోగాపురం ఎయిర్పోర్ట్ అనుసంధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించి ఎయిర్పోర్ట్ ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు దాదాపు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే విశాఖపట్నం నుంచి ఎయిర్పోర్ట్ కు వెళ్లేందుకు వీలుగా రోడ్లు నిర్మిస్తున్నామని, 54 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. వి ఎం ఆర్ డి ఏ, ఆర్ అండ్ బీ,జీవీఎంసీ సంయుక్త కార్యాచరణతో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నాయి అన్నారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఏ ప్రభాకర్ రావు, బిఎంఆర్డిఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కమర్షియల్ బుకింగ్స్ ఓకే

### వాణిజ్య సిలిండర్ల సరఫరా ప్రారంభం

### ఎల్‌పీజీ కొరత లేనే లేదు

### అందోళనతో అంకా ఒకేసారి బుక్ చేస్తున్నారు

### ముందస్తు భయంతో 88 లక్షల బుకింగ్స్

### పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశంలో ఎల్‌పీజీ సరఫరాపై నిలిచి పోయిందని ప్రజల్లో ఆందోళన పెరిగిపోయింది. దీంతో గ్యాస్ దొరుకుతుందో లేదో అని జనాలు ఎగబడి బుకింగ్స్ చేసుకోవడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దేశంలోని గ్యాస్ కొరతపై తాజాగా మరోసారి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దేశంలో ఎలాంటి కొరత లేదని.. ప్రజలు ఆందోళనతో బుకింగ్స్ చేయడం వల్లే సమస్య వచ్చిందని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల పంపిణీ మళ్లీ ప్రారంభించినట్టు తెలిపింది. ఎల్ పీ జీ కొరత నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా సిలిండర్లు దొరకవేమోనన్న భయంతో ప్రజలు ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారని.. ఇప్పటివరకు దాదాపు 88 లక్షల బుకింగ్స్ నమోదయ్యాయని ఆమె తెలిపింది. అవసరమైతే తప్ప ముందస్తు బుకింగ్స్ చేయవద్దని కోరింది. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఎల్‌పీజీ కొనుగోలుదారుగా ఉందని.. మన దేశానికి వచ్చే ఎల్‌పీజీలో 90 శాతం వాటా హార్ముజ్ గుండానే వస్తున్నాయని పేర్కొంది. అయితే ప్రస్తుతం అక్కడ రాకపోకలు నిలిచిపోవడం కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఇరాన్ భారత్‌కు సహకరిస్తుందని పేర్కొంది. అటు నుంచి భారత్‌కు వచ్చే నౌకలను అడ్డుకోబమని ఇప్పటికే ఇండియాకు ఇరాన్ భరోసా ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే తాజాగా ఇదే అంశంపై పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ సైతం కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో హార్మూజ్ నుంచి రెండు ూా+ నౌకలు భారత్‌కు వస్తున్నాయని తెలిపారు. అంతేకాదు భారత్‌లో పెట్రోల్, డీజిల్, చమురు నిల్వలు తగినంతగా ఉన్నాయని, వాటి విషయంలో ఎటువంటి కొరత లేదని స్పష్టం చేసింది.

# పరిధి దాటి విచారణ చేసారు

### దర్యాప్తునకు ఆటంకం చేసారు

### బెయిల్ రద్దు ఉత్తర్వులు ఎలా ఇస్తారు

### ఏసీబీ కోర్టు తీరుపై హైకోర్టు ఆగ్రహం

**(అమరావతి - జయజయహే)**

సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి బెయిల్ విచారణ పరిధిని దాటి మరీ ఏసీబీ కోర్టు వ్యవహరించిందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇందులో ముఖ్యంగా ఏసీబీ కోర్టు ప్రస్తావించిన అంశాలు దర్యాప్తునకు ఆటంకంగా ఉన్నాయని పేర్కొంది. వీటన్నింటిని పూర్తిగా పక్కనపెడుతూ ఉత్తర్వులివడమేంటని హైకోర్టు ప్రశ్నించింది. అయితే మిథున్‌రెడ్డి బెయిల్ రద్దు చేసేందుకు మాత్రం హైకోర్టు నిరాకరించింది. లిక్కర్ స్కాం కేసులో నిందితుడు, వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు విషయంలో విజయవాడ ఏసీబీ కోర్టు ప్రస్తావించిన కొన్ని అంశాలను హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ప్రధానంగా ఏసీబీ కోర్టు తీర్పులో ప్రస్తావించిన అంశాలకు సంబంధించిన విషయాలు కేసు దర్యాప్తునకు ఆటంకాన్ని కలిగించే విధంగా ఉన్నాయని భావించింది. అంతేకాకుండా బెయిల్ పిటిషన్‌ను తేల్చే విషయంలో ఈ ముఖ్యాంశాలను ప్రస్తావించవలసిన ఆవశ్యకత లేదని తేల్చి చెప్పింది. మిథున్‌రెడ్డి బెయిల్ విచారణ పరిధిని దాటుకుని మరీ ఏసీబీ కోర్టు వ్యవహరించిందని హైకోర్టు తెలిపింది. అంతేకాకుండా మిథున్‌రెడ్డి లిక్కర్ స్కాం కేసు దర్యాప్తు ఇంకా పూర్తికాలేదనీ, అదే విధంగా మిథున్‌రెడ్డి వ్యవహారంలో అభియోగపత్రాన్ని కూడా దాఖలు చేయలేదని తెలియజేసింది. దీని ప్రకారం ఏసీబీ కోర్టు బెయిల్‌కు సంబంధించి ఉత్తర్వుల్లో ప్రస్తావించిన ప్రధాన విషయాలు, అభిప్రాయాలను పక్కనపెడుతున్నట్లుగా పేర్కొంది. అయితే మద్యం కుంభకోణం కేసులో నిందితుడు మిథున్‌రెడ్డికి గత సంవత్సరం సెప్టెంబర్ 29వ తేదీన విజయవాడలో ఏసీబీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడం గమనార్హం. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సిట్ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. అయితే సిట్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలను వినిపించింది. దీనికితోడు ప్రస్తావించిన ప్రధాన అంశాలు దర్యాప్తు మొత్తాన్ని నిర్వీర్యం చేసేలా ఉన్నాయని హైకోర్టు వెల్లడించింది. ఇప్పటిదాకా సాంకేతికపరమైన ఆధారాలు, అదే విధంగా గూగుల్ టేక్ అవుట్ వివరాలు, వాంగ్మూలాలను ప్రధాన సాక్ష్యాలుగా పరిగణించలేమని ఏసీబీ కోర్టు తెలిపిందని హైకోర్టు వివరించింది. అంతేకాకుండా దర్యాప్తుపై దీని ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. దీని ప్రకారం ఏసీబీ కోర్టు తీర్పులో ప్రస్తావించిన అంశాల ద్వారా లిక్కర్ కేసులో మిగిలినటువంటి నిందితులు బెయిల్ పొందేటటువంటి ప్రమాదం ఉందని వాదనలను వినిపించారు. ఈ కేసులో దర్యాప్తు అనేది పూర్తి కాకపోయినా సరే పూర్తయినట్లు మిథున్‌రెడ్డికి బెయిలిస్తున్నట్లు తెలిపింది. దీంతో ఏసీబీ కోర్టు తీరు తీవ్ర విస్మయానికి గురిచేస్తుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని అభిప్రాయపడింది.

# గుడ్డుకు బ్యాడ్ టైం..!

### భారీగా ధరల పతనం

### సగానికి సగం తగ్గుముఖం

### రూ. 7.06 నుంచి రూ. 4.20కి చేరిక

### పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

**(హైదరాబాద్ - జయజయహే)**



పశ్చిమాసియాలో యుద్ధం పరోక్ష ప్రభావం దేశంలోని వివిధ రంగాలపై కనిపిస్తోంది. గ్యాస్ ధరల నుండి ఆటో ఛార్జీల వరకు ప్రతిదీ జేబులపై భారం పడుతోంది. అయితే, గుడ్డు ధరల విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో గుడ్డు ధరలు సగానికి తగ్గాయి. పెద్ద వ్యాపారులు తీవ్రంగా దెబ్బతిన్నారు. గత కొన్ని రోజులుగా గుడ్డు ధరలు సగానికి తగ్గుతున్నాయి. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో ఖచ్చితంగా తెలియదు. ఫలితంగా గుడ్డు మార్కెట్లో అనిశ్చితి పెరుగుతోంది. యుద్ధం కారణంగా భారతదేశం నుండి గల్ఫ్ దేశాలకు గుడ్ల ఎగుమతులు ఆగిపోయాయి. ఫలితంగా ధరలు గణనీయంగా తగ్గాయి. జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ అందించిన డేటా ప్రకారం, గత కొన్ని వారాలలో తెలుగు రాష్ట్రాలతో సహా చాలా రాష్ట్రాల్లో గుడ్ల ధరలు భారీగా తగ్గాయి. గతంలో గుడ్డు ధర రూ. 7.06 ఉండగా, కేవలం ఒక వారంలోనే రూ. 4.20కి తగ్గింది. అంటే దాదాపు సగానికి సగం తగ్గిపోయింది ధర.

# 23న మిట్టల్ స్టీల్‌కు శంకుస్థాపన

### హాజరుకానున్న సీఎం బాబు, డిప్యూటీ సీఎం పవన్

### ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

**(అనకాపల్లి - జయజయహే)**



నక్కపల్లి ప్రాంత పారిశ్రామికాభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలిచే స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ నెల 23న నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. ఈరోజు స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. అధికారులతో కలిసి వేదికను, పరిసర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు మరియు అతిథులు తరలివచ్చే అవకాశముండటంతో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా శంకుస్థాపన వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# చిల్లర కష్టాలకు చెక్

### ఏటీఎంలో రూ.10, రూ.20, రూ. 50 నోట్లు

### స్మాల్ వాల్యూ డిస్పెన్సర్స్ పేరిట పైలట్ ప్రాజెక్టు

### ముంబైలో ట్రయిల్స్ చేపట్టిన రిజర్వు బ్యాంక్

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

చిల్లర కష్టాలు తీరనున్నాయి. అతి త్వరలో ఏటీఎంల్లో చిన్న కరెన్సీ నోట్లు కూడా రానున్నాయి. ఇప్పటివరకూ రూ. 100 నోట్ల నుంచి రూ. 500, రూ. 2000 ఇలా ఏటీఎంల్లో అందుబాటులో ఉన్నాయి. కానీ, చిన్న మొత్తంలో చిల్లర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. చిన్న కరెన్సీ నోట్ల కోసం రోజువారీ జీవితంలో పెద్ద సమస్యగా మారింది. టీ షాపుల నుంచి ఆటో ఛార్జీలు, బస్సులు, లోకల్ మార్కెట్లో షాపింగ్ వంటి పలు ప్రదేశాల్లో తరచుగా 10, 20 లేదా 50 రూపాయల నోట్ల చిల్లర కోసం ఇబ్బందులు తప్పడం లేదు. రూ. 500కు చిల్లర దొరకదు. రూ. వెయ్యి లేదా రూ. 2వేలకు అసలు ఛాన్స్ లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంల నుంచి ఈ చిన్న కరెన్సీ నోట్లను విత్ డ్రా చేసుకునేలా పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు. ఏటీఎంల్లో ఎక్కువగా రూ.100, రూ. 200 లేదా రూ.500 నోట్లు అందుబాటులో ఉంటాయి. చిన్న లావాదేవీలకు కష్టంగా మారింది. ఇప్పుడు, ఆర్బీఐ "స్మాల్ వాల్యూ డిస్పెన్సర్లు" పేరుతో స్పెషల్ మిషన్లను టెస్టింగ్ చేస్తోంది. ఈ స్మాల్ సైజ్ ఏటీఎం మిషన్లు ప్రత్యేకంగా 10, 20, 50 రూపాయల నోట్లను పంపిణీ చేసేందుకు రూపొందించారు. ముంబై వంటి నగరాల్లో ట్రయల్స్ జరుగుతున్నాయి. ఇది సక్సెస్ అయితే దేశవ్యాప్తంగా విస్తరించనున్నారు. డిజిటల్ పేమెంట్లపై తక్కువ ఆధారపడే వారికి భారీగా ఉపశమనం లభిస్తుంది. దేశంలో ఈ నోట్ల కొరత లేదని మంత్రి చౌదరి స్పష్టం చేశారు. పార్లమెంటులో డేటా ఆధారంగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 43,940 లక్షల రూ.10 నోట్లు, 19,370 లక్షల రూ.20 నోట్లు, 13,030 లక్షల రూ.50 నోట్లు ముద్రించినట్టు తెలిపారు. గత సంవత్సరాలతో పోలిస్తే భారీగా పెరిగింది, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6,000 లక్షల నుంచి రూ.10 నోట్లు రెట్టింపు అయ్యాయి. చిల్లరకు ఇక ఇబ్బంది ఉండదు. సాధారణ ప్రజల రోజువారీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్బీఐ ఈ చర్య తీసుకుంది. చిన్న నోట్లతో లావాదేవీలు ఈజీ కానున్నాయి. ఈ ప్రాజెక్ట్ సక్సెస్ అయితే భవిష్యత్తులో ప్రతి ఏటీఎం నుంచి చిన్న నోట్లను డ్రా చేసుకోవచ్చు.

# 16 నుంచి ఒంటిపూట బడులు

### మధ్యాహ్న భోజనం కొనసాగింపు

### పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

**(అమరావతి - జయజయహే)**

విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో ఒంటి పూట బడులు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల16వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు తెలిపారు. విద్యాశాఖ ఆదేశాలు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసారు.

# నిరంతర పర్యవేక్షణ

**మొదటి పేజీ తరువాయి...**

కొనసాగుతోందని కేంద్రం పేర్కొంది. దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఎల్‌పీజీని పూర్తి స్థాయిలో గృహ వినియోగదారులకు మళ్లించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఆసుపత్రులు, విద్యాసంస్థలకు నాన్-డొమెస్టిక్ ఎల్‌పీజీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లకు ఎల్‌పీజీ కేటాయింపులపై ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కమిటీ సమీక్ష చేస్తోంది. గృహ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.935గా ఉంది. దీపం - 2 పథకం కింద అర్హులకు ఏడాదికి మూడు సిలిండర్లకు 100 శాతం సబ్సిడీ అందిస్తున్నారు. గ్యాస్ సరఫరా నియంత్రణకు మార్చి 9న నేచురల్ గ్యాస్ కంట్రోల్ ఆర్డర్ జారీ చేయగా, గృహ పీఎన్‌జీ , వాహనాల సీఎన్‌జీ సరఫరాకు 100 శాతం సరఫరా కొనసాగుతోంది. ఎలాంటి కోతలు లేవు. పరిశ్రమలకు గత ఆరు నెలల సగటు వినియోగంలో 80 శాతం, ఎరువుల కర్మాగారాలకు 70 శాతం కొనసాగుతుండగా.. రిఫైనరీలు, పెట్రోకెమికల్ యూనిట్లకు 35 శాతం సరఫరా తగ్గించారు. పానిక్ బుకింగ్, నిల్వలు చేసే పరిస్థితి మీద ఇప్పటికే ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. గృహ ఎల్‌పీజీ సాధారణ డెలివరీ సమయం రెండు నుంచి ఐదు రోజులు మాత్రమే. ఎల్‌పీజీ బుకింగ్ మధ్య గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచారు. ఇంధన సరఫరా అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్, విజయవాడ హోటల్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. తక్షణం తమకు గ్యాస్ సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో హోటళ్లు నడపలేమని యజమానులు స్పష్టం చేశారు. ఈ అంశంపై కూడా ప్రస్తుత సమావేశంలో మంత్రులు, అధికారులు చర్చించారు.

# మీరు బాగుండాలనే.. మా ఆకాంక్ష

మొదటి పేజీ తరువాయి...

పరిశీలించారు. తమది పూర్తిగా పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రజల కన్నీరు తుడవడమే తమ నిబద్ధత అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాలకు అందాల్సిన నిధులను అడ్డగోలుగా మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతాలు వెనుకబడ్డాయని ఆయన విమర్శించారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ. 4 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. సమస్యలు చెప్పుకోవడానికి అప్పటి ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్తే కనీసం గ్రామం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే ప్రజల గడప దగ్గరకు వచ్చిందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని అందిస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా, తాము ఎక్కడా వివక్ష చూపలేదని ఆయన గుర్తు చేశారు. మీరు ఓట్లు వేశారా లేదా అని మేము చూడటం లేదు, మీరు బాగుండాలనేదే మా ఆకాంక్ష అని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారని, కానీ ప్రజల కోసం పనిచేసే తనకు ఎలాంటి భయాలు లేవని, గిరిజన హక్కులకు భంగం





వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై పవన్ కళ్యాణ్ అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓనూరు ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో పాటు, నందిగరువులోనే నూతన అంగన్వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గిరిశిఖర ప్రాంతాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ మోతల కష్టాలను తప్పించడానికి రాబోయే కాలంలో మరిన్ని రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటిని ప్రతి ఇంటికి అందిస్తామని, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ఏజెన్సీలో గడిచిన 18 నెలల్లోనే 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించడం ఒక రికార్డు అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో పాఠశాల భవనాలు, తాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పవన్ కళ్యాణ్ రాకతో మారుమూల గిరిజన గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.



## సీసీ రోడ్ల ప్రారంభం... బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళి

**కొవ్వూరు, జయజయహే ప్రతినిధి:**

కొవ్వూరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.29 లక్షల వ్యయంతో గౌతమీనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.అనంతరం ఔరంగాబాద్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే జనరల్ ఫండ్స్ ద్వారా రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అభివృద్ధి పనులు చేపట్టినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టూమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, పీక్కి నాగేంద్ర, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపని చిన్ని, సూర్యదేవర రంజిత్, వేమగిరి వెంకటరావు, పాక జయరాం, కండెల్లి రామారావు, అక్షయపాత్ర శ్రీనివాస్, రవీంద్ర, పెనుమాక జయరాజు, బీవీ ముత్యాలరావు, బత్తి నాగరాజు, బొబ్బిలి పేర్రాజు, బీజేపీ నాయకుడు రత్నసాయి, కొప్పాక జవహర్, వేల్పూరు శ్రీనివాస్ తదితర ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిడదవోలు పీహెచ్‌సీని సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు, జయజయహే ప్రతినిధి**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న మంత్రి, వైద్యులు మరియు సిబ్బందితో ఆరోగ్య సేవల మెరుగుదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్ల పనితీరు, మందుల నిల్వలను మంత్రి పరిశీలించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తి మానవతా సేవతో కూడుకున్నదని, వైద్యులు సేవాభావంతో పని చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి జనసేన నాయకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రంగా రమేష్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, కూటమి నాయకులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



### జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

## రాజానగరంలో భారీ బైక్ ర్యాలీ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లాలో జనసేన పార్టీకి అడ్డాగా రాజానగరం నియోజకవర్గం నిలిచిందని ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. శనివారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజానగరం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ దివాన్ చెరువు, కొంతమూరు మీదుగా కోరుకొండ వరకు భారీగా కొనసాగింది. ఈ ర్యాలీలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన జెండాలు ఎగురవేస్తూ, పార్టీ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల సమస్యల పరిష్కారం కోసం జనసేన కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు మంచి పాలన అందించడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని అన్నారు. ర్యాలీకి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉపాధి హామీపై చిత్తశుద్ధి లేదు

**(విశాఖపట్నం - జయజయహే)**

ఉపాధి హామీ పథకం పై బిజెపి కి చిత్తశుద్ధి లేదనీ పీసీసీ చీఫ్ షర్మిల అన్నారు.అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో ఉపాది హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా రచ్చబండ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైయస్ షర్మిల పాల్గొన్నారు. ఈ రచ్చబండ కార్యక్రమంలో జిల్లాలోని పలు సమస్యలను వైయస్ షర్మ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైయస్ షర్మిల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా దేశంలో కోట్ల మందికి ఉపాధి కలుగుతుందనీ,కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 18లక్షల జాబ్ కార్డులు తొలగించారన్నారు. బీజేపీ తెస్తున్న కొత్త చట్టం ఒక బూటకం అని ఉపాధి హామీ పథకానికి కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ పేరు పెడితే బీజేపీ ఆ పేరును చంపేస్తుందన్నారు. మహాత్మా గాంధీని గాడ్సే చంపితే ప్రధాని నరేంద్ర మోదీ మహాత్మా గాంధీ పేరును చంపేస్తున్నారన్నారు. బీజేపీనీ ఎదిరించే సత్తా ఆంధ్రప్రదేశ్లో ఏ నాయకుడికి లేదు అని రాజధాని కోసం పార్లమెంట్ లో అడగడానికి ఒక్క మగాడు కూడా లేదన్నారు. దివగశీత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు చంద్రబాబు,జగన్ లు తూట్లు పొడుస్తున్నారన్నారు.



## మాదిగ హత్యాకాండపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి: ఎమ్మార్పీఎస్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గాలపై జరుగుతున్న హత్యాకాండ ఘటనల్లో నిందితులను శిక్షించేందుకు తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని మాదిగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజుడిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించి కుటుంబానికి ఒక్క ఉద్యోగం ఇవ్వాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా నగరానికి వచ్చిన ఆయన శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా తెలుగు దేశం కు మద్దతుగా నిలిచిన మాదిగల పట్ల ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం వివక్షత చూపుతోందని ఆరోపించారు. గత 20 నెలల్లో రాయలసీమతో పాటు ఇతర జిల్లాల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు క్రూరంగా హత్యకు గురైనా ఇప్పటివరకు నిందితులపై కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రాయలసీమ జిల్లాల్లో జరిగిన పలు దారుణ ఘటనల్లో చిప్పగిరి లక్ష్మీనారాయణ, జానకి, గోవిందమ్మ, సతీష్ తదితరులు సహా 13 మంది మాదిగ వర్గీయులు బలయ్యారని తెలిపారు. ఈ కేసులపై ఐదు నెలల్లో విచారణ పూర్తిచేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని, వచ్చే 15 రోజుల్లో చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాదిగ సామాజిక వర్గాలను సమీకరించి అమరావతి లో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోడి కిషోర్, వంగల వీర్రాజు, తలారి నాని, హనుమంతరావు, ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా మెడికల్ క్యాంపు

**కొయ్యూరు : (జయ జయహే)న్యూస్ మార్చ్ 15**

అల్లూరి జిల్లా కొయ్యూరు లో ఆదివారం వారపు సంతలో మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మెగా మెడికల్ క్యాంపును నిర్వహించనున్నారు . ఈ క్యాంపు నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ ఫౌండర్ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మరియు శివప్రసాద్ సహకారంతో నర్సీపట్నం శారదా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. ఈ క్యాంపులో సుమారు 2 వేల మందికి పరీక్షలు చేసి మందులు ఇవ్వబడతాయి. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ క్యాంపు నిర్వహించబడుతోంది అని నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ ఫౌండర్ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మరియు శివప్రసాద్ తెలిపారు.




# ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నిడదవోలు, జయజయహే ప్రతినిధి:**

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిడదవోలు పట్టణంలోని గణేష్ చౌక్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరై జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపన నుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ముందుకు సాగుతోందని తెలిపారు. పార్టీ అధినేత ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త ప్రజలకు అండగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జనసేన పార్టీ పని చేస్తోందని పేర్కొన్నారు. అలాగే పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జనసేన పార్టీ మరింత బలంగా ఎదిగి ప్రజలకు సేవ



చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# చిన్నారుల ప్రతిభతో అలరించిన కన్వొకేషన్ వేడుకలు

**నిడదవోలు, జయజయహే ప్రతినిధి:**

నిడదవోలు పట్టణంలోని ఏకేఆర్‌జి హై స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల కన్వొకేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు వివిధ రకాల నృత్యాలు, మంచి అలవాట్లపై చిన్న నాటికలు, సంభాషణ కార్యక్రమాలు ప్రదర్శించి హాజరైన వారిని ఆకట్టుకున్నారు. చిన్నారుల అమాయకమైన ప్రదర్శనలు, వారి ప్రతిభను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ పిల్లలను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కన్వొకేషన్ సర్టిఫికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ చిన్నారులకు విలువలతో కూడిన ఉత్తమ విద్యను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యతో





పాటు సంస్కారం, నైతిక విలువలు పెంపొందేలా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల చైర్మన్ చావా గోకుల్ అందించిన సహకారం వల్లే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగామని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ఆయన ఎప్పుడూ అండగా నిలుస్తూ విద్యార్థుల ప్రగతికి ప్రోత్సాహం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## మ్యాట్రిమోనీ ముసుగులో

# సైబర్ మోసాలు

(సి.హెచ్.ప్రతాప్)



డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాలను సులభతరం చేసినప్పటికీ, అదే సమయంలో కొత్త రకాల నేరాలకు కూడా దారి తీస్తోంది. ముఖ్యంగా సైబర్ నేరాలు రోజురోజుకు కొత్త రూపాలు దాల్చుతున్నాయి. ఇటీవల హైదరాబాద్ పోలీసులు మ్యాట్రిమోనీ పేరుతో అమాయకులను మోసం చేసి కోట్ల రూపాయలు దోచుకున్న ఒక అంతర్జాతీయ సైబర్ నేరస్తుడిని పట్టుకోవడం ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందో స్పష్టంగా చూపుతోంది.

సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేరస్తులు మారుతున్న సాంకేతికతను ఉపయోగించి కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఈజీ మనీ, ఆన్‌లైన్ వర్క్ ఫ్రం హోం, పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని చెప్పడం వంటి వాగ్దానాలతో ప్రజలను ఆకర్షించి వారి కష్టార్జిత సంపాదనను దోచుకుంటున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని హనీ ట్రాప్ పద్ధతులు కూడా ఉపయోగిస్తున్నారు.

మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు కూడా ఇప్పుడు మోసగాళ్లకు ఒక వేదికగా మారడం ఆందోళన కలిగించే విషయం. పెళ్లి కోసం సరైన జీవిత భాగస్వామిని వెతుక్కోవడానికి ప్రజలు ఈ వేదికలను ఆశ్రయిస్తారు. కానీ అదే విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తూ కొందరు నకిలీ ప్రొఫైళ్లను సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారు. యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి తరువాత పెట్టుబడుల పేరుతో డబ్బు వసూలు చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి.

ఇటీవల బయటపడిన ఘటనలో ఒక వ్యక్తి మ్యాట్రిమోనీ వేదికను ఉపయోగించి నకిలీ క్రిప్టో ట్రేడింగ్ పెట్టుబడుల పేరుతో పలువురిని మోసం చేశాడు. బాధితుల్లో కొందరి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు వెల్లడైంది. ఒక బాధితుడి నుంచి ఏకంగా పదకొండు లక్షల రూపాయలు తీసుకున్నట్లు సమాచారం. ఈ మోసాలకు పాల్పడేందుకు నిందితుడు వందల సంఖ్యలో అక్రమ సిమ్ కార్డులను సేకరించి నకిలీ ఖాతాలను సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు.

బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు విదేశాల నుంచి వస్తున్నట్లు సమాచారం అందడంతో చెన్నై విమానాశ్రయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరాల అంతర్జాతీయ వలయాన్ని గుర్తుచేస్తోంది.

ఈ సంఘటన సమాజానికి ఒక హెచ్చరికగా నిలుస్తోంది. డిజిటల్ ప్రపంచంలో పరిచయాలు ఏర్పరుచుకునేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. ముఖ్యంగా ఆన్‌లైన్ పరిచయాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం ప్రమాదకరం.

సాంకేతికత మనకు సౌకర్యాన్ని అందించినప్పటికీ, అప్రమత్తత లేకపోతే అదే ప్రమాదంగా మారుతుంది. అందువల్ల ప్రజలు అవగాహన పెంచుకోవడం, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా మాత్రమే ఈ తరహా సైబర్ మోసాలను తగ్గించవచ్చు.


# రావణుడు-ఆధునిక యుగానికి అద్దం

*రావణుడు కేవలం పురాణాల్లో ఉండే రాక్షసరాజు మాత్రమే కాదు --- ఆయన మానవ మనసు యొక్క గాఢమైన ప్రతిబింబం. ఆయన కథలో ఉన్న మహిమ, అహంకారం, మరియు పతనం --- ఇవన్నీ నేటి సమాజానికి ఒక అద్దంలా నిలుస్తాయి. రామాయణంలో ఆయన పతనం ఒక వ్యక్తి లేదా ఒక రాజ్యానికి సంబంధించినది మాత్రమే కాదు; అది మానవ అహంకారం, నైతికత లేమి, మరియు విలువల క్షీణత పై ఉన్న శాశ్వత హెచ్చరిక.*




### రావణుని మూడు శాశ్వత పాఠాలు

జ్ఞానం వినయం లేకుంటే ప్రమాదం: రావణుడు మహాజ్ఞాని. ఆయన అన్ని వేదాలు, శాస్త్రాలు, యుద్ధకళలు నేర్చుకున్నాడు. కానీ ఈ జ్ఞానం ఆయనను వినయానికి తీసుకెళ్లలేదు; అహంకారానికి దారితీసింది. అదే కారణంగా ఆయన జ్ఞానం ఆయన వినాశనానికి కారణమైంది. ఇది మనకు గుర్తు చేస్తుంది: "విద్య మనసును వెలిగించాలి; దహనం చేయకూడదు."



శక్తి నైతికత లేకుంటే వినాశనం: రావణుడు లంక రాజ్యాన్ని బంగారంతో తీర్చిదిద్దాడు. కానీ ఆ బంగారు లంకలో భయం, అహంకారం, మరియు అన్యాయం నెలకొన్నాయి. ఆయన శక్తి ధర్మానికి కాకుండా తన అహంకారానికి సేవ చేసింది. ఇది ఆధునిక సమాజంలో కూడా స్పష్టంగా కనపడుతుంది. సాంకేతిక శక్తి, అణు శక్తి, లేదా ఆర్థిక బలం --- ఇవన్నీ నైతిక నియంత్రణ లేకపోతే ప్రమాదకర ఆయుధాలుగా మారతాయి.

అహంకారం మనసులో ఉంటే ధర్మం దూరమవుతుంది; రావణుడు ధర్మాన్ని మర్చిపోయాడు. తనే పరమేశ్వరుడనుకున్నాడు. అదే ఆయన పతనానికి మూలం. భారతీయ సంస్కృతి మనకు చెబుతుంది --- అహంకారం మానవ విలువలను కరిగిస్తుంది. మనిషి ఎంత విద్యావంతుడైనా, అహంకారం ఉన్నచోట ధర్మం నిలవదు.

రావణుడు మరియు ఆధునిక భారతీయ యువత

నేటి యువత ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభతో గుర్తింపు పొందుతున్నారు --- విజ్ఞానం, సాంకేతికత, ఆవిష్కరణలలో అగ్రస్థానంలో ఉన్నారు. కానీ ఈ విజయపథంలో రావణునిహాకథ వారికి ఒక ప్రాసంగిక సూత్రం నేర్పుతుంది --- జ్ఞానం వినయం, సేవ, మరియు నైతికతతో కలిసినప్పుడే మానవతకు దోహదం చేస్తుంది.

ప్రతి విద్యార్థి, శాస్త్రవేత్త, లేదా నాయకుడు తనలోని రావణుణ్ణి గుర్తించాలి --- ఆ అహంకారం, ఆ స్వార్థం, ఆ వినయలేమి. ఈ అంతర్మథనం మన ఆత్మాభివృద్ధికి మొదటి మెట్టు. "జ్ఞానం ఉన్నచోట వినయం ఉండాలి; లేకపోతే జ్ఞానం కూడా నాశనానికి మార్గం చూపుతుంది."

యువతకు రావణుడు ఒక ప్రతిబింబం --- ఎలా ఉండకూడదో నేర్పించే గురువు. ఆయన పతనం ఒక పాఠం: అహంకారం మన శక్తిని బలహీనతగా మార్చేస్తుంది.

### భారతీయ తత్వంలో రావణుని స్థానం

భారతీయ తత్వం రావణుణ్ణి పూర్తిగా చెడుగా చూడదు. ఆయనను మహాజ్ఞాని, శివభక్తుడు, మరియు తపస్వి అని గౌరవిస్తుంది. ఆయన రాసిన శివతాండవ స్తోత్రం ఇప్పటికీ భక్తుల హృదయాల్లో ఆరాధనగా మారింది.

ఇది భారతీయ తత్వంలోని విశాల దృష్టిని చూపిస్తుంది --- మనిషిలో మంచితనం మరియు చెడుపు రెండూ సహజం. ఆ రెండు మధ్య సమతుల్యత నేర్చుకోవడమే నిజమైన ఆధ్యాత్మికత.

రావణుని జీవితం మనకు చెప్పే నీతి ఏమిటంటే: "జ్ఞానం, భక్తి, మరియు శక్తి అన్నీ దివ్యమైనవే, కానీ అవి వినయం లేకపోతే అవి నశిస్తాయి."

### రావణుని పతనం -- మన అహంకారానికి అద్దం

రావణుడు మనకు ఒక శాశ్వత సత్యం నేర్పుతాడు: "జ్ఞానం దేవత్వానికి తీసుకెళ్లగలదు, కానీ అహంకారం దాన్ని నరకంలోకి నెట్టగలదు." అతని కథ భక్తి, ధర్మం, మరియు వినయానికి ప్రతీక. అతని భక్తి మనకు భక్తి యొక్క శక్తిని నేర్పుతుంది; అతని పతనం వినయం యొక్క అవసరాన్ని గుర్తుచేస్తుంది.

నేటి భారతదేశం జ్ఞానం, శక్తి, మరియు అభివృద్ధిలో అగ్రగామిగా ఉన్నప్పటికీ, రావణుడి హెచ్చరిక సందేశం మనకు మార్గదర్శనం కావాలి. ధర్మం లేకుండా జ్ఞానం శూన్యం; వినయం లేకుండా శక్తి ప్రమాదం.

"జ్ఞానం దివ్యమైనది, కానీ అది వినయం ద్వారా మాత్రమే పవిత్రమవుతుంది."



ప్రొఫెసర్.
విశ్వేశ్వర రావు చెనమల్లు

## ప్రాంతీయ ఘర్షణ నుంచి

# ప్రపంచ సంక్షోభం దిశగా ఇరాన్-ఇజ్రాయెల్ పోరు

(సి.హెచ్.ప్రతాప్)



మధ్యప్రాచ్య ప్రాంతం గత కొన్ని దశాబ్దాలుగా అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు నిలయంగా మారింది. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య అగాధం పెరుగుతుండటం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ఒకప్పుడు పరోక్ష యుద్ధాలకు పరిమితమైన ఈ వైరం ఇప్పుడు ప్రత్యక్ష సైనిక దాడుల స్థాయికి చేరుకుంది. ఈ పరిణామం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగానే కాకుండా ప్రపంచ గతిని మార్చే భారీ సంక్షోభంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రెండు దేశాల మధ్య విభేదాలకు చారిత్రక, రాజకీయ, భద్రతాపరమైన కారణాలు అనేకం ఉన్నాయి.

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వైషమ్యాలకు ప్రధాన కారణం ఆధిపత్య పోరు. ఇజ్రాయెల్ తన ఉనికికే ఇరాన్ ముప్పుగా పరిగణిస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమాలు చేపడుతుండటం ఇజ్రాయెల్ భద్రతా ఆందోళనలను మరింత పెంచింది. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకుంటే అది తమ మనుగడకే ప్రమాదమని ఇజ్రాయెల్ భావిస్తోంది. మరోవైపు ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌ను మధ్యప్రాచ్యంలో అస్థిరతకు మూలకారణంగా నిరంతరం విమర్శిస్తోంది. సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రాంతీయ శక్తిగా ఎదగాలనే ఆకాంక్షలు ఈ దేశాల మధ్య శత్రుత్వాన్ని తీవ్రతరం చేశాయి.

ఇటీవలి కాలంలో ఇరు దేశాలు ఒకరిపై ఒకరు నేరుగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకోవడం యుద్ధ మేఘాలను కమ్మేలా చేసింది. ఈ ఘర్షణలో ఇరాన్ మద్దతు ఉన్న వివిధ సాయుధ సమూహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. లెబనాన్‌లోని హిజ్బొల్లా వంటి సంస్థలు ఇరాన్ తరపున పోరాడుతుండటంతో ఈ వివాదం బహుముఖ యుద్ధంగా మారుతోంది. ఇజ్రాయెల్ సరిహద్దుల్లో నిరంతరం కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులు ఈ ప్రాంతాన్ని ఒక అగ్నిగుండంగా మార్చాయి.

మధ్యప్రాచ్యంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ చమురు నిల్వలకు ఈ ప్రాంతం కీలకమైన కేంద్రం కావడంతో ఇక్కడి అస్థిరత చమురు సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకడం వల్ల అన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. రవాణా మార్గాలపై దాడులు జరగడం వల్ల ప్రపంచ వాణిజ్యం స్తంభించిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు సైతం ఈ ఘర్షణతో వేగంగా మారుతున్నాయి. అమెరికా వంటి అగ్రరాజ్యాలు ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తుండగా కొన్ని దేశాలు ఇరాన్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ విధంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా విడిపోవడం వల్ల మరొక ప్రపంచ యుద్ధం సంభవిస్తుందేమోనన్న భయం వ్యక్తమవుతోంది. దౌత్యపరమైన చర్చలు విఫలమవ్వడం, పరస్పర కక్షసాధింపు చర్యలు పెరగడం వల్ల పరిస్థితి క్లిష్టంగా మారుతోంది.

ప్రస్తుత తరుణంలో అంతర్జాతీయ సమాజం మౌనం వీడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా ఉద్రిక్తతలను తగ్గించే దిశగా బలమైన చర్యలు తీసుకోవాలి. యుద్ధం వల్ల కలిగే వినాశనం కంటే శాంతి వల్ల కలిగే స్థిరత్వం ఎంతో విలువైనదని గుర్తించాలి. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే ఏకైక మార్గం. ఆయుధాల మోత కంటే శాంతి వచనాలు ప్రపంచానికి నేడు అత్యవసరం.

మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనడం అనేది ప్రపంచ సుస్థిరతకు ప్రాణాధారం. ఇరాన్--ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న ఈ మంటలను సకాలంలో ఆర్పకపోతే అవి ప్రపంచవ్యాప్తంగా పెను విపత్తుకు దారితీస్తాయి. ప్రపంచ నాయకత్వం తక్షణమే స్పందించి దౌత్య మార్గాల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించి ఒక శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలి. యుద్ధం ఎవరికీ విజయాన్ని చేకూర్చదు అది కేవలం విధ్వంసాన్ని మాత్రమే మిగులుస్తుంది.

## మొజ్తబా ఆచూకీ చెబితే...

# 10 మిలియన్ డాలర్లు

### రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా

ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే 'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం. కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

## మరింత దిగజారిన బంగారం ధరలు




అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివారం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉ ంది . నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉ ంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# ప్రజా సంక్షేమమే జనసేన ధ్యేయం





**విజయనగరం (జయ జయహే )**

ప్రజా సంక్షేమమే జనసేన ధ్యేయమని జనసేన నేతలు పాలవలస యశస్వి , గురాన అయ్యలు అన్నారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేసి రక్తదాన శిభిరం నిర్వహించారు. డొక్కా సీతమ్మ పేరుతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేతలు పాలవలస యశస్వి , గురాన అయ్యలు తో మాట్లాడుతూ నేను ప్రశ్నించడానికే వచ్చాను" అంటూ పవన్ కళ్యాణ్ అనే ఒకే ఒక్కడు ఎగరేసిన జనసేన జెండా, నేటికి 13 వసంతాల అలుపెరుగని ప్రయాణాన్ని పూర్తి చేసుకుందన్నారు. ఓటమి వెక్కిరించినా, అవమానాలు చుట్టుముట్టినా, ప్రజల పక్షాన నిలబడాలనే పవన్ కళ్యాణ్ సిద్ధాంతమే ఈ 13 ఏళ్ల ప్రస్థానానికి ఆయువుపట్టు అన్నారు. కేవలం రాజకీయ పార్టీగా కాకుండా, ఒక సామాజిక విప్లవంగా జనసేన రూపుదిద్దుకుందన్నారు. రాజకీయాల్లో నాయకుడు అంటే కేవలం ఓట్లు అడిగేవాడు, హామీలు ఇచ్చేవాడు కాదని.. కష్టాల్లో కన్నీళ్లు తుడిచి, ఆదుకునేవాడని పవన్ కళ్యాణ్ తన చేతలతో నిరూపించారన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలే తన బలమని, వారే తన కుటుంబమని నమ్మి, వారికి బీమా సౌకర్యం కల్పించి అండగా నిలవడం జనసేన నైజమన్నారు. 2024 ఎన్నికల్లో సాధించిన అద్భుత విజయం జనసేన ప్రస్థానంలో ఒక చారిత్రక మైలురాయి అన్నారు. కేవలం పార్టీ ప్రయోజనాల కంటే రాష్ట్ర భవిష్యత్తే మిన్న అని భావించి, కూటమి ఏర్పాటులో పవన్ కళ్యాణ్ చూపిన రాజకీయ పరిణతి, ఆయన నిస్వార్థానికి నిలువుటద్దమన్నారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళాలు, జన సైనికులు పాల్గొన్నారు.



## మహిళా ఆరోగ్య రక్షణకు
# హెచ్‌పివి టీకా

**క్యాన్సర్ నివారణకు ఈ వ్యాక్సిన్ కీలకం**

**టెక్కలి మార్చి 14 జయ జయహే**

దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యంగా బాలికలు క్యాన్సర్ బారిన పడకుండా ఉన్నత లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారధ్యంలో 14 నుంచి 15 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్పివి టీకా ను ప్రతి ఆరోగ్య కేంద్రంలో పంపిణీ జరుగుతుంది, ఇందులో భాగంగా టెక్కలి మండలం సాకి పల్లి కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రతినిధుల సారథ్యంలో హెచ్ పి వి వ్యాక్సిన్ ను బాలికలకు వేశారు, ఈ టీకా ద్వారా మహిళలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారణ జరుగుతుందని, ముఖ్యంగా బాలికలకు ఈ వ్యాక్సిన్ 95% క్యాన్సర్ వ్యాధిని నిరోధించే అవకాశం ఉందని చాలా కీలకమని పీహెచ్సీ వైద్యులు గాయత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో టెక్కలి మండలం బిజెపి అధ్యక్షులు, కోటబొమ్మాలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ ర్జాన రాంజీ పాల్గొని బాలికల ఆరోగ్యం, సమాజ అభివృద్ధికి కేంద్రం మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న ఇటువంటి ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలు ఎంతగానో అవసరమని రాంజీ తెలిపారు. ఆయనతోపాటు శ్రీకాకుళం జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నడుపూరి లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులు ఆకుల ప్రకాష్, బాబురావు ఆరోగ్య సిబ్బంది స్థానికలు పాల్గొన్నారు.



# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణలు

**టెక్కలి మార్చి 14 జయ జయహే**

దేశ ప్రగతికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యం ఎంతో అవసరం అని విద్యార్థులు భవిష్యత్తు కు అభివృద్ధి దిశగా అడుగులు వేసేందుకు సాంకేతిక నైపుణ్యం ఉన్న శిక్షణలు చాలా ప్రయోజనకరమని ఐతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ సాంకేతిక శిక్షణాభివృద్ధి సంస్థ సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యశాల లో హైదరాబాద్ కు చెందిన కాయగన్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యశ్వంత్ రిసోర్స్ పర్సన్ గా విద్యార్థులకు శిక్షణలు అందించారని ఇటువంటి ప్రాయోజిత అవగాహన సదస్సులు వల్ల సాంకేతిక పరమైన నాలెడ్జ్ మంచి అవగాహన పెంచుతుందని ఇది విద్యార్థుల భవిష్యత్తుకు, పునాదులు లాంటివని, సమాజం అభివృద్ధి చెందడానికి ఇ టువంటి అంశాలు వల్ల మేలు జరుగుతుందని డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ వై రమేష్, డాక్టర్ బి రామారావు, కోఆర్డినేటర్ జి సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఈ ఏడాది 46.85 లక్షల మంది రైతులకు
# పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ పంపిణీ

**మాడుగుల మార్చి 14, జయ జయహే**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. శనివారం మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల కే కోటపాడు లో వి ఎం ఆర్ డి ఏ కన్వెన్షన్ సెంటర్కు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే రూ.6000కు తోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 కలిపి మొత్తం రూ.20 వేల రూపాయలను ఈ ఏడాది 46.85 లక్షల రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ"మూడో విడత నిధుల విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు సారథ్యంలో గన్నవరం ఏరియాలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం లైవ్ ఎల్ఈడి ప్రాజెక్టులో ఎమ్మెల్యే తిలకించారు. అంతకుముందు కే కోటపాడులో సుమారు కోటి రూపాయలతో వీఎంఆర్డిఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న కన్వెన్షన్ సెంటర్ కి ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డిఏ కమిషనర్ తేజ భరత్, పిఎంఆర్డిఏ చైర్మన్ ప్రణయ్ గోపాల్ రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాద్ రావు తో పాటు మండల ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాంత్‌కు ఉగాది పురస్కారం

**శ్రీకాకుళం (జయ జయహే)**

వేమన కవితాలయం విశ్వాసహితి కళావేదిక సంయుక్తంగా శ్రీకాకుళం శివ శివాని ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉగాది ప్రత్యేక కార్యక్రమం లో విశాఖ నగరానికి చెందిన ప్రముఖ కవి సత్తివాడ శ్రీకాంత్ కి ఉగాది పురస్కారం అందించారు.తెలుగు భాష కి అయన చేస్తున్న సేవలు కుగానూ ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా సత్తివాడ శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు ను రక్షించుకోకుంటే భవిత ప్రశ్న గా మిగిలిపోతుందని విచారం వ్యక్తం చేసారు. భాషకోసం తోటి కవులు కళాకారులు చేసే మహోత్కర్యాన్ని అయన ప్రశాంశించారు. ఈ కార్యక్రమం లో శివ శివాని పార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై. శ్రీనివాస రావు , కొల్లి రమావతి,ఈ వేమన, కుమార్ రాజు ఆమ్మో బామ్మిడి తదితరులు పాల్గొన్నారు.



## రావికమతంలో జనసేన
# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రావికముతం, మార్చ్ 14 జయ జయహే**

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శనివారం చోడవరం నియోజవర్గంలో గల రావికమతం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం నియోజవర్గ ఇన్చార్జి పి వి ఎస్ ఎం రాజు జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తయి 13వ వసంతలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సాహసయోధుడు ప్రజానాయకుడు త్యాగశీల నిరంతర ప్రజాపక్షపార్టీ అయిన పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి కావడానికి ముందు ఎన్నో పోరాటాలు ప్రజల కోసం నిలబడిన తీరు నిరూపమానమని కొనియాడారు. ఆయన వెంట నడవడం తమకు అత్యంత గౌరవాన్ని ఇచ్చిందని ఈ క్రమంలో తాము ఎంతో గౌరవాన్ని తెచ్చుకున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా పార్టీతోనే ఉండి ప్రజలకి సేవ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రావికమతం మండల పార్టీ అధ్యక్షులు మైచర్ల నాయుడు చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామ అప్పారావు ,చోడవరం మండల పార్టీ అధ్యక్షులు గూనూరు మూలు నాయుడు, రోలుగుంట మండల అధ్యక్షులు బలిజి మహారాజు, బుచ్చయ్య పేట అధ్యక్షులుడి ఎస్ నాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షులు కర్రీ రమేష్, చోడవరం మండలం వీరమహిళా అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు ,టౌన్ పార్టీ అధ్యక్షురాలు సరోజిని తదితర నాయకులు పాల్గొన్నారు



# ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

**బుచ్చయ్య జయ జయహే**

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మండలం లో గల రాజాం,మల్లం, అర్ భీమవరం, దిబ్బిడి, వడ్డాది, నెలకంటపురం సీతయ్యపేట తదితర గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కే ఎస్ ఎం ఎస్ రాజు శనివారం అందజేశారు.దిబ్బిడి గ్రామానికి చెందిన సియ్యాద్రి సూర్యనారాయణ అనారోగ్యం తో మృతి చెందడం తో ఆ కుటుంబం కు ఆర్థికంగా ఆదుకోవడానికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి సూర్యనారాయణ భార్య రమణమ్మకు రూ 75,000 రూపాయలు, మంజూరు చేసారు. అలాగే జొన్న పల్లి రాము మరణించడంతో ఆయన కుటుంబానికి సహాయం గా ఉండాలన్న ఉద్దేశ్యం తో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ 25, 000 మంజూరు చేసారు.సీతయ్యపేట గ్రామానికి చెందిన అల్లు శ్రీనివాస్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వివిధ హాస్పటల్లో చికిత్స తీసుకుంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఆయన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు సహకారంతో గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా శనివారం రెండు లక్షల 25 వేల 93 రూపాయల (2,25, 093) రూపాయల చెక్కు లను చోడవరం ఎమ్మెల్యే గారి కార్యాలయం లో శనివారం మన ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు గారి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వం అందించిన సహాయం ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గునూరు మల్లునాయుడు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్మన్లు కోట సత్యనారాయణ, దొడ్డి కిషోర్, గొన్నా బత్తుల శ్రీనివాసరావు, వజ్రపు ఇంద్రశ్రీను, పెడిరెడ్ల రాజు, గాలి సూరిబాబు,సానపతి శ్రీను, మణికంత, గంట పాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# గోసంరక్షణతోనే దేశ పురోగమనం

**డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే**

**కర్నూలు (జయ జయహే)**


గోసంరక్షణతోనే దేశ పురోగమనం ఆధారపడి ఉంటుందని, దేశానికి గోవు మూలాధారమని, గో సంరక్షణతో సకలైశ్వర్యాలు సాధించవచ్చని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడురోజులపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సి. హెచ్.వి. రాజారెడ్డి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ప్రవచనాలు, మల్యాల, తూడిచర్ల నుండి వెంకట రమణ, సోమన్న బృందాలు చేసిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారమండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బి.వెంకోజి రావు, కోశాధికారి యం. సత్యనారాయణ రావు, అర్చకులు శ్రీధర్, యం. జయగౌరి, జి. కృష్ణారావు, భవాని కుమార్, జి. నాగరాజు, ఎన్. వెంకటరావు, జి. మోహనరావు, యం. కృష్ణ, పి. రామారావు, బి.రఘునాధరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘు రామాచార్యులు, మాకా శేషయ్య, ఎల్. ఐ. సి. రామకృష్ణారెడ్డి, రమణ, సాయిరాం విద్యాసంస్థల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, డాక్టర్ మోక్షేశ్వరుడు, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు లక్ష్మన్న, శివారెడ్డి, రమేశ్ రెడ్డి, ఎన్ లక్ష్మీబాయ్, జి.నాగమణి బాయ్, ఎస్.లక్ష్మి, ఎస్.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మజీద్-ఏ-అమన్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

## 400 మందికి పైగా ఉపవాసదారులకు సేవలు

**విశాఖపట్నం జయ జయహే**

పవిత్ర రమజాన్ మాసం ఆధ్యాత్మికత, సహనం, దానధర్మాలు, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర సమయంలో విశాఖపట్నం నగరంలోని సాగర్ నగర్ ప్రాంతంలో ఉన్న మస్జిద్-ఏ-అమన్ లో ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీఎం ఆర్‌ఆర్డిఏ చైర్ పర్సన్ ప్రణవ్ గోపాల్‌ఆహ్వానించడం జరిగింది మస్జిద్ పరిసరాలు భక్తుల సందడి మరియు ప్రార్థనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.అబ్దుల్ ఖుద్దుస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ముస్లిం సోదరులు, పెద్దలు, యువకులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం మఘ్రిబ్ నమాజ్ సమయం దగ్గరపడే సరికి మస్జిద్ ప్రాంగణంలో ఉపవాసదారులు సమకూరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో ఖర్జూరం మరియు నీటితో ఉపవాసాన్ని విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వివిధ రకాల వంటకాలు, పండ్లు, పానీయాలు మరియు ఇతర ఆహార పదార్థాలు భక్తులకు అందించారు. సుమారు 400 మందికి పైగా ఉపవాసదారులు ఈ విందులో పాల్గొని ఉపవాసాన్ని విరమించారు. భక్తులు పరస్పరం సోదరభావం, ఐక్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా అబ్దుల్ ఖుద్దుస్ మాట్లాడుతూ పవిత్ర రమజాన్ మాసం మానవాళికి సహనం, సేవాభావం, దానధర్మాలు మరియు పరస్పర గౌరవం నేర్పించే పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, ప్రేమ, ఐక్యత మరింత బలపడాలని



అల్లాహ్‌ను ప్రార్థించారు. ఇఫ్తార్ విందు ద్వారా ఉపవాసదారులకు సేవ చేయడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మస్జిద్ కమిటీ సభ్యులు అల్లా బక్షు, హకీమ్ భాయ్, అమీన్ సాహెబ్, షానవాజ్, అమీర్ మరియు స్థానిక యువత ప్రత్యేకంగా కృషి చేశారు. వారి సమన్వయం మరియు సేవాభావం వల్ల కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 8వ



వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావు, దొర బాబు, టిడిపి మహిళా నాయకురాలు మంగ దేవి, లోడగల రామ్మోహన్ సుమంత్ హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమజాన్ మాసం అందరికీ శాంతి, సౌభాగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. మజీద్-ఏ-అమన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు సోదరభావాన్ని ప్రతిబింబిస్తూ ఘనంగా జరిగింది.




# శ్రీ సత్యసాయి బాబా పల్లకి మహోత్సవం

**విశాఖపట్నం( జయ జయహే)**

పెద్ద వాల్తేర్ లో భగవాన్ శ్రీ సత్యసాయి భజన మండలి, లాసెస్ బే కాలనీ ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకి మహోత్సవం స్వామి సేవకుల చే అంగ రంగ వైభవంగా సాగింది. విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యాలయం నుండి మరియు వివిధ సత్యసాయి భజన సమితిలు పల్లకి మహోత్సవం లో టి.వెంకట్రావు లాసన్స్ బే భజన మండలి కన్వీనర్ , కన్వీనర్ బి సాయి కుమార్ సిటీ సమితి కన్వీనర్ , రామరాజు సిటీ సమితి పాల్గొన్నారు. సమాజ శ్రేయస్సుకు నిత్య సేవ, దైవ నామ స్మరణం నిత్యం చేయాలని అదే భగవాన్ సత్యసాయి మార్గమని స్వామి తెలిపారని సిటీ సమితి కన్వీనర్ సాయికుమార్ తెలిపారు.

# ఈ నెల 16 నుండి ఉచిత గాలి కుంటు వ్యాది నివారణ టీకాల కార్యక్రమం

**మాడుగుల మార్చి 14 జయ జయహే**



జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం మార్చి ఈనెల వ తేదీ నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమశీ నిర్వహించ నున్నట్టుహామాడుగుల ఏరియా పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వి చిట్టి నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని వారి వద్ద ఉన్న నాలుగు నెలల వయసు దాటిన ప్రతి పశువు కు టీకాలు ఇప్పించాలని సూచించారు.పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని టీకాలు వేయించుకుంటే పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా ఉంటుందని పేర్కొన్నారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువులులో ఈ లక్షణాలు ఉంటాయి తీవ్రమైన జ్వరం నీరసం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం,చూడి పశువులు ఈసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాగే ఎద్దులలో పని సామర్థ్యం తగ్గటం, పాల ఉత్పత్తి తగ్గి పని చేసే సమర్ధ్యం కూడా తగ్గిపోతాయనీ, వ్యాధి సోకిన తల్లి పాలు త్రాగే దూడలకు మరణం సంబవించవచ్చున్నారు. కాబట్టి తక్షణ వైద్యం అందించక పోతే పశువు చనిపోయే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంనకు సంబంధించి చీడికాడ మండలానికి 17450 డోసులు , మాడుగుల మండలానికి 17550 డోసులు టీకా మందు వచ్చినట్లు తెలియ జేశారు.ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్య ఆద్వర్యంలో నేషనల్ అనిమల్ డీసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం 2019 సంవత్సరం నుంచి భారత ప్రభుత్వం ఈ వాక్సిన్ ను ఉచితంగా అందిస్తుందన్నారు. 2030 సంవత్సరం నాటికి గాలి కుంటు వ్యాధి లేని దేశంగా చూడటం ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.



# వరదాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో పాల్గొన్న కంబాల

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం కోరుకొండ మండలం రాజవరం గ్రామంలోని శనివారం జరిగిన శ్రీశ్రీశ్రీ వరదాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం, అన్నసమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమానికి లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి అందరూ కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, పెద్దాడ వెంకన్న దొర, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, ఆనం చెల్లరావు, నాగ రమేష్, తాటికొండ సురేష్, తుమ్మల బుజ్జి, పదిలం చక్రరావు, మండే గౌతమ్, వీరబాబు, రాఘవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# చోడవరం అరకు కార్యాలయంలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చోడవరం మార్చి 14 జయ జయహే**

చోడవరం ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో ఆర్క్ ప్రసాద్ అధ్యక్షతన జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వపు వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిరుపేద కుటుంబాలకు ఉపాధి అవకాశంగా కుట్టు మిషన్స్ పంపిణీ చేసారు. ఈ సమావేశానికి రాష్ట్ర శిష్ట కరణ సంఘం అధ్యక్షులు అక్కు మహంతి రాజా ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.చోడవరం అర్బన్ జనసేన అధ్యక్షులు రమేష్...ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షులు గునూరు మూలునాయుడు,సీనియర్ నాయకులు గూనూరు సూర్యనారాయణ,అడ్వకేట్ చీపురుపల్లి సూర్యనారాయణ, సింగంపల్లి రమేష్,డి శ్రీనివాస్, రాష్ట్ర సంఘం జనరల్ సెక్రటరీ గౌరీశ్వర రావు,మహిళా ప్రతినిధి కవిత,తిరుపతి రావు,సత్యారావు,విశ్వేశ్వర రావు,టీచర్ శ్రీనివాస్, రాజకుమార్,శేష గిరి, శ్రీకాంత్,గోపాల పట్నం గణేష్,వ రామచంద్ర రావు,నూక రాజు ఇతర సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆచార్య ముత్యాల నాయుడు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గ్రామీణ ,ఆదివాసీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో..ప్రాథమిక సదుపాయాలు రోడ్డు,తాగునీరు, ఆరోగ్యం లాంటి ప్రధాన సమస్యలు పరిష్కారం జరుపుతున్నారన్నారు.యువతకి స్ఫూర్తి గా చైతన్యం దిశగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముత్యాల నాయుడు పనిచేస్తున్నారన్నారు. రాజా మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం పవన్ కళ్యాణ్ స్ఫూర్తి తో మరింత మెరుగైన స్థాయిలో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా వీరమహిళ లైనా రమా దేవి..శైలజ కుటుంబాలకు కుట్టు మిషన్లు అందజేశారు.



# ఘనంగా శ్రీ నూకాలమ్మ పొలిమేర యాత్ర

**భీమిలి (జయ జయహే)**

భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి పొలిమేర యాత్ర జనసందోహం మధ్య దిగ్విజయంగా జరిగిందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయ పూజారులు చౌదరి సత్యరాజు, వెంకటేష్, మారుతి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు గంటా నూకరాజు, మారోజు సత్యప్రసాద్, శిల్లా కరుణాకర్ రెడ్డి, గాడు యస్వంత్ కుమార్, ఉసిరికల బంగార్రాజు, సౌజన్యంతో అమ్మవారి పొలిమేర యాత్ర 5-30 గం.లకు ప్రారంభించారు. చిన్న బజార్, కీటిన్ పేట, బ్యాంక్ కోలనీ, యాత కుమ్మరిపాలెం మీదుగా సాగిన ఈ పొలిమేర యాత్రలో వందలాది భక్తులు పాల్గొన్నారు. బ్యాంక్ కోలనీ శ్రీ కుంచుమాంబ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు, అమ్మవారికి మేళతాళాలతో స్వాగతం పలికి పసుపు, కుంకుమలు సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరు కావడంతో ముందుగానే పండగ వాతావరణం మొదలయింది. అనంతరం అమ్మవారి భక్తుడు కీ.శే. కర్రోతు రమణబాబు ఇంటివద్ద కొలువై ఉంచారు. శనివారం సాయంత్రం 6 గం.లకు బోయవీధి గ్రామ పెద్దలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో దాసరికం (గరిడి), ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మహిళల కోలాటంతో పురవీధుల్లో అమ్మవారి యాత్ర సాగుతుంది. తోటవీధి, మసీద్ రోడ్డు, బస్టాండ్, గంటస్తంభం ఏరియా వైపు వెళ్లి ఆలయ పూజారులు చౌదరి సత్యారావు కుటుంబసభ్యులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించిన అనంతరం మరలా పునఃప్రారంభం అవుతుంది. అమ్మవారిని మరలా చదునుపట్టు వద్ద కొలువై ఉంచి ఉత్సవాలకు సిద్ధం కావడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ నూకాలమ్మ తల్లి మాలధారణ భక్తులతో పాటు వాసుపల్లి కొండబాబు, ముత్యాలరావు, మైలపల్లి లక్ష్మణరావు, గుండాసు మధు, అంజనీకుమార్ మరియు వందలాది భక్తులు పాల్గొన్నారు.



# పీఎం జన్మన్ గ్రాంట్ ద్వారా రోడ్డు శంకుస్థాపన

**కొయ్యూరు (జయ జయహే )మార్చ్ 15**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ ఆర్ల గ్రామం నుంచి కుమ్మర్ల బంధ గ్రామం వరకు పీఎం జన్మన్ గ్రాంట్ పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ద్వారా ఆరున్నర కిలోమీటర్ల రోడ్డు నాలుగు కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో రోడ్డు నియమించడం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం డోలిమోత లేని గ్రామాలను చూడాలని ఒకే ఒక్క ఉద్దేశంతో చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గర్రెంగి రాజేశ్వరి చేతుల మీదుగా రోడ్డుకి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీరాములు. చలపతి కార్యకర్తలు బిర్జానా అప్పారావు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# వేగంగా మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించండి...!

## వీఎంఆర్‌డిఏ అధికారులతో మంత్రి నారాయణ

**విశాఖపట్నం, మార్చి 14, జయ జయహే :**

భోగాపురం విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభించే నాటికి మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం పూర్తి కావాలని పట్టణ పురపాలక శాఖా మంత్రి నారాయణ ఆదేశించారు. రెండు రోజుల విశాఖ పర్యటనలో భాగంగా శనివారం రాత్రి వి ఎం ఆర్ డి ఎ మాస్టర్ ప్లాన్ రహదారులను ఆయన పరిశీలించారు. వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి మంత్రి నారాయణ నేరెళ్ళ వలస నుంచి కొత్తవలస, బోయపాలెం నుంచి కాపులుప్పాడ, భీమిలి నుంచి దొరతోట జంక్షన్ కి వెళ్ళే రహదారుల నిర్మాణాలను పరిశీలించారు. రహదారుల నిర్మాణంలో తలెత్తుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత రహదారుల నిర్మాణ స్థితి, ఎప్పటి లోగా పనులు పూర్తి అవుతాయనేది తెలుసుకున్నారు. రహదారుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ రహదారుల నిర్మాణాలు పూర్తి అయితే భోగాపురం ఎయిర్ పోర్టు కు చేరుకునేందుకు వీలుగా ఉంటాయని అధికారులు వివరించారు. వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో ఈ రహదారుల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, రహదారుల అభివృద్ధి పనులను వివరించారు. అనుకున్న సమయానికి వీటి నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఇతర ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్‌లో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన





## భీమిలి ఎమ్మెల్యే గంటా

**కొమ్మాది, మార్చి 14: (జయ జయహే)**


ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ కు వచ్చే నెల మొదటి వారంలో శంకుస్థాపన చేయనున్నట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అమెరికాయేతర ప్రాంతాల్లో గూగుల్ డేటా సెంటర్ కు ఇది హెడ్ క్వార్టర్ గా ఉంటుందని పేర్కొన్నారు. కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి లోకేష్ నాయకత్వంలో విశాఖ ఐటీకి కేరాఫ్ అడ్రస్ కానుందన్నారు. పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా విశాఖలో ఒకేసారి 15 అంతర్జాతీయ ఐటీ కంపెనీలకు లోకేష్ శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఐటీ కొలువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విశాఖకు ప్రఖ్యాత కంపెనీలు తీసుకువస్తున్నామన్నారు. తను నడుపుతున్న విద్యా సంస్థల పేరును ఇంటి పేరుగా మార్చుకున్న చైతన్య రాజు, 1999లో తాను అనకాపల్లి ఎంపీగా పోటీ చేసినప్పుడు పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారని రాజుతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి అహర్నిశలు కష్టపడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, గరే గుర్నాథ్, మన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, మామిడి దుర్గారావు, చెట్టుపల్లి సన్యాసిరావు, బోయి రమాదేవి, లొడగల జానకిరామ్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.




## లోక్ అదాలత్‌తో 908 కేసులు పరిష్కారం

**చోడవరం మార్చి 14 జయ జయహే**

చోడవరం కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలతో మొత్తం 908 కేసులు పరిష్కారం అయ్యాయి. వాటిలో 24 సివి కేసులు, 883 క్రిమినల్ కేసులు, ఒకటి ఫ్రీ లిటిగేషన్ కేసు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో నైన్త్ అడిషనల్ జిల్లా జడ్జి ఎం హరి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జ్ వి గౌరీ శంకర్రావు, ప్రిన్సిపల్ జూనియర్స్ జడ్జి స్వర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ఎల్లారావు, కార్యదర్శి చీపురుపల్లి సూర్యనారాయణ న్యాయవాదులు పాల్గొన్నారు



### అధికంగా పిల్లలను కనమనే

## ఆలోచనను ముఖ్యమంత్రి విరమించుకోవాలి

### డా॥ ఎన్. తులసి రెడ్డి

**గుంటూరు (జయ జయహే)**

జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ మంది పిల్లలను కనమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొని అమలు చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ డా ॥ ఎన్. తులసి రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జనాభా పెరుగుదల సంపదా? సమస్యా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా ॥ ఎన్. తులసిరెడ్డి ప్రసంగిస్తూ సంతోష సూచిక,మానవాభివృద్ధి, తలసరి ఆదాయ సూచికల్లో భారతదేశం అట్టడుగున ఉందని, ఉన్న యువతకే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కనుమరుగువుతున్న స్థితిలో ఇంకా పిల్లల్ని కనమని ముఖ్యమంత్రి స్థాయిలో పేర్కొనడం భావ్యం కాదన్నారు. సమాజంలో వృద్ధులను శాపంగా,భారంగా చూడరాదని, అభివృద్ధి చెందిన దేశాలలో 90 సంవత్సరాల వరకు అపార అనుభవంతో విశిష్ట కృషి చేస్తున్నారని, వారిని భారంగా కాకుండా వరంలా చూడాలన్నారు. సంతానోత్పత్తి రేటు ఎక్కువగా ఉన్న సమాజం అభివృద్ధి చెందుతుంది అనే భావనలో ముఖ్యమంత్రి ఉన్నారని, ఆ లెక్కన సంతానోత్పత్తి రేటు 4.4 గా ఉన్న ఆఫ్రికా ఖండం ఎందుకు వెనకబడి ఉందని, సంతానోత్పత్తి రేటు 1.6 గా ఉన్న యూరప్ ఖండం ఎందుకు అభివృద్ధి చెందిందని ప్రశ్నించారు. సంతానోత్పత్తి రేటు అభివృద్ధికి కొలమానం కాదన్నారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రముఖ వైద్యులు డా ॥ ఆలా వెంకటేశ్వర్లు ప్రముఖ విద్యావేత్త రమేష్ పట్నాయక్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, డాక్టర్ రాజా సిద్ధార్థ ,బీసీ మహా జన సభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.వి. చలపతిరావు, విశ్రాంత పోలీస్ అధికారి అమలాపురపు అమరాచారి, విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ ఏ.వి పటేల్, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ విద్యావేత్త కన్నా రెడ్డి, మానవత కార్యదర్శి కె. సతీష్, కోశాధికారి టి.వి. సాయిరాం, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పటాన్ అల్లాబక్షు తదితరులు ప్రసంగించారు.

### అనారోగ్య మహిళకు

## 50,000 ఆర్థిక సహాయం

**చోడవరం జయ జయహే**



అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వైస్సార్సీపీ నాయకుడు చిన్నశీ నాగరాజు 50,000 ఆర్థిక సహాయం అందించారు చోడవరం పట్టణంలోని ఇందిరా కాలనీలో ఎలకా దేవి (32)జీర్ణకోస వ్యాధితో బాధపడుతున్న ఆమెకు ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం వైయస్సార్సీపి అనకాపల్లి జిల్లా సీనియర్ నాయకుడు చిన్నం నాగరాజు అనకాపల్లికి చెందిన కొంతమంది యువకుల ద్వారా50,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇంకా వైద్య ఖర్చు నిమిత్తమే ప్రతినెల సహాయ సహకారాలు అందిస్తామని దళితులు ఎవరైతే వెనుకబడి ఇబ్బంది పడుతున్నారో వారికి చేయత ఇస్తానని ఈ సందర్భంగా చిన్నం నాగరాజుతెలియజేశారు.



## గోవాడలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చోడవరం మార్చి 14 జయ జయ హే**

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమశీ పల్లె పల్లెల్లో పండగ వాతావరణం లో చేయాలని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశించిన నేపథ్యంలో చోడవరం జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పి వి ఎస్ ఎన్ రాజు ఆదేశాల మేరకు శనివారం గోవాడ గ్రామంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామప్పరావు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనగ నిర్వహించారు. సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఉద్దేశాన్ని అందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పళ్ళు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడువాక నూకరాజు, ప్రధాన కార్యదర్శి బండి గోపి, నీటి సంఘం డైరెక్టర్ ఏడువాక శీను, పాల సంఘం డైరెక్టర్ ధరంశెట్టి దాలినాయుడు, స్కూల్ కమిటీ డైరెక్టర్ వేపాడ చిరంజీవి, సేనాపతి అప్పలనాయుడు, వేపాడ అప్పారావు, బేరా సన్యాసిరావు గోవాడ జనసేన పార్టీ కార్యకర్తలు పార్టీ నాయకులు పాల్గొన్నారు



## బాబూ..బువ్వెలా ఉంది...!

### అన్నప్రసాద నాణ్యతను పరిశీలించిన ఈవో వెంకట్రావు

**సింహాచలం, మార్చి 14, జయ జయహే :**

ఏమండీ ... స్వామి వారి భోజన ప్రసాదం ఎలా ఉందండి...రుచి బాగుందా...నాణ్యతగా ఉంటుందా అని సింహాచలం దేవస్థానం కార్య నిర్వాహణాధికారి జె. వెంకట్రావు భక్తులను అడిగారు. శనివారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ పెరిగింది. వీకెండ్ కావడంతో స్వామివారి దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా, స్వామి వారి నిత్య అన్నప్రసాద వితరణ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు అన్నప్రసాద భవనాన్ని సందర్శించారు. అన్నప్రసాదం తయారీలో వాడుతున్న ముడి పదార్థాలు, వంటశాల పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భక్తులకు వడ్డించే అన్నం, పప్పు, కూరల రుచిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తుల వద్దకు వెళ్ళి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి, భక్తులతో నేరుగా మాట్లాడి ఆరా తీశారు. “అన్న ప్రసాదం రుచిగా ఉంది, పంపిణీ కూడా క్రమబద్ధంగా జరుగుతోంది” అని భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో భక్తులు క్యూలైన్లలో ఇబ్బంది పడకుండా వేగంగా ప్రసాద వితరణ చేయాలని, ఎక్కడా నాణ్యత తగ్గకుండా జాగ్రత్త వహించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ రమణమూర్తి , పర్యవేక్షణ అధికారి పాలూరు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



## రోగులకు మెరుగైన సేవలు అందించండి

### కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

**విశాఖపట్నం, మార్చి14, జయ జయహే**

ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆప్యాయత, ప్రేమతో కూడిన సేవలు అందించడం ద్వారా సకాలంలో రోగం నయమై రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని, నర్సింగ్ సిబ్బంది అంతా బాధ్యతగా పనిచేయాలని కింగ్ జార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. స్టాఫ్ నర్స్ నుంచి హెడ్ నర్సులుగా పదోన్నతులు పొంది కేజీహెచ్లో శనివారం విధుల్లో చేరిన పలువురు నూతన హెడ్ నర్సులు సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగుల సేవలు విషయంలో ఇబ్బంది లేకుండా, ప్రతి ఒక్కరూ విధి నిర్వహణ పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. పదోన్నతులు పొందిన ప్రతి నర్సింగ్ ఉద్యోగికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎసఆరఎంఓ డాక్టర్ కుమార్, ఏపీ జిఈఏ ఉపాధ్యక్షురాలు వి.ఉషారాణి, ఏపీ నర్సులు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు బి. భాగ్యలక్ష్మి, సీనియర్ హెడ్ నర్సులు డి.లక్ష్మి, సుజానమ్మతో పాటు పలువురు నూతన హెడ్ నర్సులు , స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

# స్వర్గీయ కమల జోషి సేవలు మరువలేనివి

### బొల్లవరపు జాన్ వెస్లీ

**తూర్పుగోదావరి, (జయ జయహే)**


చాగల్లు గ్రేస్ గోస్పల్ పెంతుకోస్తు చర్చిలో స్కూల్ ఆఫ్ ఎవాంజెలిసమ్ ఫౌండర్ స్వర్గీయ కమల జోషి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బిషప్ కర్నల్ అధ్యక్షత వహించారు . పాస్టర్ ప్రసాద్ గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ కమల జోషి చేసిన సేవలను గుర్తు చేశారు.స్కూల్ ఆఫ్ ఎవాంజెలిస్మ్ ద్వారా ఎంతోమంది పాస్టర్స్ ను ఈ జిల్లాలో దైవ సేవకులుగా అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరికి ఏ సహాయము అవసరమైన ముందుండి సహాయ సహకారాలు అందించే వారిని చెప్పారు. నిజమైన దైవజనురాలుగా నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించమని ఏసుప్రభు చెప్పిన మాటలను ఆచరించిన ధన్యురాలని తెలియజేశారు. ఎంతోమంది ఇబ్బందులలో ఉన్నపేద విద్యార్థులను చదివించి



ప్రయోజకులను చేయడం జరిగిందని తెలియజేశారు. మన మధ్యలో లేకపోయినా మనందరం కమల జోషి ని జ్ఞాపకం చేసుకుంటున్నాం అంటే అందుకు కారణం ఆమె చేసిన మంచి పనులే అని చెప్పారు. కేజే ఫౌండేషన్ ద్వారా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో దేవుని సేవ జరుగుతున్నదంటే దానికి ముఖ్య కారణం కమలా జోషి తనయుడు సహోదరుడు రాబిన్ పాల్ ఎంతైనా అభినందనీయులని తెలియజేశారు. ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసిన బిషప్ మాథ్యూ మేఘర్ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటేనే లోకానికి ఎదురీదడమని ప్రతి క్రైస్తవుడు దేవునికి లెక్కచెప్పవలసిన ఆ వస్యత ఉన్నదని తెలియజేశారు. క్రైస్తవుడు సమాధానం కలిగి ఉండాలి అదేవిధంగా క్రైస్తవుడు కృప కలిగి ఉండాలి ఈ రెండు క్రైస్తవ జీవితానికి ముఖ్యమని తెలియజేశారు. అనంతరం కేజే ఫౌండేషన్ అధినేత రాబిన్ పాల్ మాట్లాడుతూ మా తల్లి గారైన కమల జోష్ మమ్మల్ని నిజమైన క్రైస్తవులుగా అందరికీ మార్గదర్శకంగా ఉండే విధంగా పెంచారని తెలియజేశారు. ఈరోజు మేము ఇంత ఉన్నతమైన స్థానంలో ఉన్నామంటే దానికి కారణం మా తల్లిదండ్రులు చేసిన మంచి పనులే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ గుణ శామ్యూల్, రెవరెండ్ బ్లెస్సింగ్ రాజు,రెవరెండ్ ప్రసాద్,రెవరెండ్ జెకర్యా అధిక సంఖ్యలో క్రైస్తవ నాయకులు అభిమానులు పాల్గొనడం జరిగింది.

# పరీక్షల కాలం... నిజంగానే "పరీక్షా" కాలమే...!

**విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా 10 బోర్డు పరీక్షలు అనగానే ఒత్తిడికి గురువుతారు. ఆ ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏదాగ్రతతో క్రమ ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదవడం సరైన మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో శారీరకంగా, మానసికంగా అలసిపోయి ప్రతికూల ఆలోచనలతో ఆందోళన చెందుతుంటారు. ఇలాంటి సమయాలలో ఎంతో నేర్పుగా ఉండి, ఆందోళనలకు దూరం, ప్రణాళిక బద్ధంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తే అనుకున్న విజయాన్ని సాధిస్తారు.**



**విజయానికి సూత్రాలు :**

– నమ్మకం : సబ్జెక్టుల్లో వారు పట్టు సాధించేందుకు కృషి చేయాలి. ముందుగా విద్యార్థులు తనపై తనకు నమ్మకం కలిగి ఏదైనా సాధించగలమనే ధీమా పెంచుకోవాలి. లక్ష్యయ సాధనకు ఉన్న అడ్డంకులను తొలగించుకోవాలి.

– ఏకాగ్రత : పాఠ్యంశాలను చదివే క్రమంలో పూర్తి ఏకాగ్రత కలిగి ఉండాలి. చదివే సమయంలో ఆలోచనలు,




చూపు. పక్కదారి పట్టకుండా చూసు కోవాలి. యోగా–ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. ప్రతిరోజు టైం టేబుల్ ప్రకారం చదువుకోవాలి.

– మానసిక స్థితి : పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో ఎలాంటి ఆందోళనలకు గురి కాకూడదు. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి.

– క్రమశిక్షణ: సెల్‌ఫోన్, టీవీలకు బానిసలు కాకుండా పుస్తకాలపైనే దృష్టిపెట్టాలి. గంటలు తరబడి చదవాలనే నియమం లేదు. మానసికంగా సంసిద్ధులుగా ఉన్న సమయంలోనే పాఠ్యాంశాలు చదవాలి. టైం టేబుల్ ప్రకారం చదువు కోవాలి.

– అందమైన చేతి రాతతో : పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే. అందమైన చేతి రాత ఎంతో ఉపకరిస్తుంది. అక్షరాలను ఆకట్టుకునే విధంగా గుండ్రంగా రాస్తూ. పదాలకు పదాలకు మధ్య సమ దూరాన్ని పాటించాలి.





అక్షరాలన్ని ఒకే సైజుతో ఉండేలా, అక్షర దోషాలు లేకుండా, కొట్టి వేతలకు తావులేకుండా చూసు కోవాలి.

–వైద్యులతో కౌన్సెలింగ్: పరీక్షలు అంటేనే భయం" అనే విద్యార్థులకు ఒత్తిడి బారిన పడకుండా స్థానిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. ప్రశాంతంగా ఉండేందుకు సలహాలు సూచనలు చేయాలి. మంచి పౌష్టిక ఆహారం తీసుకోవడం, యోగా, ధ్యానం చేసే విధంగా ప్రోత్సహించాలి. సరైన నిద్ర కలిగి ఉండాలి. సమయానికి తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. జంక్ ఫుడ్, మాంసాహారాలకు దూరంగా ఉండాలి. పప్పు దినుసులు, ఆకు కూరలు, పాలు, పండ్లు ఎక్కువగా తినాలి.

**డాక్టర్ ఏవి సుభాష్**

**ప్రొఫెసర్ గాయత్రీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి, విశాఖపట్నం**




# వీధిలైట్లు వెలుగు లేక ఇక్కట్లు

## నాడిశెట్టి శాంతారావుకు విన్నపం

**నెల్లిమర్ల (జయ జయహే)**

నెల్లిమర్ల శ్రీరాంనగర్ కోలనీ లో స్థంభాలు ఉన్నప్పటికీ రాత్రి పూట వీధిలైట్లు వేయకపోవుట వలన చిమ్మ చీకటిలో వెలుగు లేకపోవుట వలన చీకట్లో దొంగలు భీభత్సంగా తిరుగుతున్నారని, ఇదేఅదనుగా వయసులో ఉన్న ఆడపిల్లలను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెక్రటరీ నాడిశెట్టి శాంతారావుకు శ్రీరాంనగర్ కోలనీ వాసులు విన్నవించారు. ఈ విషయాన్ని తెలుసుకున నాడిశెట్టి శాంతారావు నెల్లిమర్ల నగర పంచాయతీ సిబ్బందితో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన రహదారి టర్నింగ్ రెండవ వీధిస్థంభం నందు వీధిలైట్లు అమర్చలేనందున కుటుంబాలతో చాలా ఇక్కట్లు పడుతున్నారని సమస్య పట్ల పరిష్కార మార్గం చూపాలంటూ అధికారులను నాడిశెట్టి శాంతారావు కోరారు. అందుకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేయాలని మరియు ఆ శ్రీరాంనగర్ కోలనీ వాసులతో కలిసి సమస్య అడిగి తెలిసికోవాలని శాంతారావు కోరారు. ఆ వీధిలైటు స్థంభానికి విద్యుత్ బల్బు మార్చాలని నెల్లిమర్ల నగర పంచాయతీ కమీషనర్ నకు ఆదేశాలను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డిని నాడిశెట్టి శాంతారావు కోరారు.






### ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ

# దినోత్సవ వేడుకలు

## మజ్జిగ చలివేంద్రం .. జనసేన పార్టీ ముగ్గుల పోటీలు

## పారిశుద్ధ్య కార్మికులకు గొడుగుల పంపిణీ

**విజయనగరం (జయ జయహే)**

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను 42వ డివిజన్ కామాక్షి నగర్, అయ్యన్నపేట ఎస్సీ, బీసీ కాలనీలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, ప్రముఖ సామాజిక కార్యకర్త త్యాడ రామకృష్ణారావు ( బాలు) ఘనంగా నిర్వహించారు. ముందుగా కాలనీలో ఇంటింటికి జనసేన ముగ్గుల పోటీలను నిర్వహించారు , మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు 42వ డివిజన్లో ఉన్న 12 మంది పారిశుద్ధ్య కార్మికులకు గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మరియు ముగ్గులు వేసే ప్రతి ఒక్కరికి బహుమతులను పంచిపెట్టారు. ఈ సందర్భంగా త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలతో జనసేన పార్టీని స్థాపించారని, దేశంలోనే గౌరవప్రదమైన రాజకీయాలకు శ్రీకారం చుట్టిన నాయకులు పవన్ కళ్యాణ్ అని, పాతిక కేజీల బియ్యం కోసం కాదని పాతిక సంవత్సరాల యువత భవిష్యత్తు కోసం జనసేన పార్టీ నిలబడుతూ..ఆంధ్రప్రదేశ్లో జనసేన పార్టీ లేనిదే భవిష్యత్తులో రాజకీయాలు ఉండవని చెప్పి, చేసి నిరూపించిన ఘనత పవన్ కళ్యాణ్ దేనని అన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలతో మరింత ముందుకు వెళ్తామని తెలిపారు.కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ యువ నాయకులు లాలిశెట్టి రవితేజ, లోపింటి కళ్యాణ్, దువ్వి రాము, పతివాడ శ్రీను, కలిశెట్టి రామకృష్ణ, నలమారాజు, అంజి, కృష్ణ, రమేష్, ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే...!

## చిన్నారి చికిత్స కోసం రూ.2 లక్షల ఆర్థికసాయం

## చెక్కును అందించిన కేకే, వాసుపల్లి

**విశాఖపట్నం, మార్చి 14, జయ జయహే :**

విశాఖపట్నం పర్యటనలో భాగంగా ఈ నెల 4న నగరానికి వచ్చిన సందర్భంగా ఓ చిన్నారికి మాజీ సీఎం జగన్ రూ. లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తానికి చెందిన చెక్ ను శనివారం అందజేశారు. 39వ వార్డుకు చెందిన చిన్నారిపాప జోయ మహమ్మద్ బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న పరిస్థితిని ఆమె తండ్రి ఎండీ హఫీజ్ అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి కి వివరించారు. ఆ వెంటనే స్పందించిన ఆయన ఆ చిన్నారి వైద్య చికిత్స కోసం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆ మొత్తానికి చెందిన చెక్ ను ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉ



న్న వారి నివాసానికి వెళ్లి వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు, విశాఖ దక్షిణం నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కలిసి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, యస్.ఇ.సి సభ్యులు డాక్టర్ జహీర్ అహ్మద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్



గాంధీ, జోనల్,జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు యం. సునీల్, అంబటి శైలేష్, బోండా ఉమామహేశ్వరరావు, పీలా ప్రేమ్ కిరణ్, వార్డు అధ్యక్షులు ముజుబ్ ఖాన్, బొడ్డేటి ప్రసాద్, అలుపన కనక రెడ్డి, పార్టీ నాయుకులు ఎస్.కే బాబ్జి , పొంతిన హరికృష్ణ, సత్య, మాదిరి, శ్రీను ,రమన్ సాయి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.




# విశాఖలో గ్యాస్ కష్టాలు

## ఏజెన్సీ వద్ద బారులు తీరుతున్న వినియోగదారులు

## రోజుకు 15 వేల మంది బుకింగ్

**విశాఖపట్నం, మార్చి 14 జయ జయహే**

విశాఖ జిల్లాలో గ్యాస్ కొరత తీవ్రతరమవుతోంది. మరో పక్క కమర్షియల్ గ్యాస్ అందక నగరంలో హోటల్స్, టిఫిన్ సెంటర్ లు మూత పడుతున్నాయి. శనివారం నగరంలో అన్ని గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు గ్యాస్ కోసం బారులు తీరి కనిపించారు. వినియోగదారులు బుక్ చేసిన 10 రోజులకు కూడా గాస్ అందడం లేదని , బ్లాక్ లో అమ్ముతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో గ్యాస్ బుకింగ్ కౌంటర్ ల వద్ద వినియోగదారులు బారులు తీరుతున్నారు. పాఠశాలలో కట్టెల పొయ్యి లు వినియోగిస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే గృహ అవసరాల వినియోగదారులు గ్యాస్ కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని పౌరసరఫరా అధికారులు చెబుతున్నా పరిస్థితి అందుకు భిన్నంగానే కనిపిస్తుంది. రాబోయే రోజులలో గ్యాస్ కొరత వస్తుందనే ఆందోళనతో ప్రజలు ముందుగానే బుక్ చేసు కొంటున్నారు. విశాఖలో రోజూ 5 వేల బుకింగ్స్ జరుగు తాయి. 25 రోజులు గడువు ఉన్నప్పటికీ వినియోగదారులు ఆందోళనతో ముందుగానే బుకింగ్ చేయడం వల్ల రోజుకు 15 వేల వరకు బుకింగ్స్ వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కమర్షియల్ గ్యాస్ అత్యవసర విభాగాలైన హాస్పిటల్స్, పాఠశాలలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. హోటల్స్ తదితర కమర్షియల్ వారికి ప్రస్తుతానికి నిలుపుదల చేశామంటున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు టీమ్ లు ఏర్పాటు చేసి కమర్షియల్ అవసరాలకు వినియోగదారుల గ్యాస్ సిలిండర్ లు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తున్నారు.




# బీసీలకు 'రక్షణ'తో భరోసా

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

## త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి...

## వెనుకబడిన వర్గాల ధన, మాన, ప్రాణ రక్షణకు ప్రాధాన్యం

## బీసీల గౌరవప్రద జీవనం కూటమి సంకల్పం : మంత్రి సవిత

**విజయవాడ :(జయ జయహే)**

వెనుబడిన తరగతుల కులాల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించేలా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నామని, త్వరలోనే ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. బీసీలను కులం పేరుతో గాని, వృత్తి పేరుతో గాని దూషించినా, సాంఘిక బహిష్కరణలకు పాల్పడినా గాని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత నేతృత్వంలో శనివారం నిర్వహించిన బీసీ రక్షణ చట్టం భేటీలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ పాల్గొన్నారు. మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన అన్నీ హామీలను నెరవేరుస్తున్నామని, ఈ నేపథ్యంలో త్వరలోనే బీసీ రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నామని తెలిపారు. చట్టం రూప కల్పనకు తుది రూపు ఇవ్వడానికే బీసీ మంత్రులతో కీలక భేటీ నిర్వహించామన్నారు. ఇది వరకే రెండు పర్యాయాలు బీసీ మంత్రులు సమావేశమయ్యామన్నారు. ఇప్పటికే బీసీ చట్టం ముసాయిదా కూడా సిద్ధం చేశామన్నారు. 138 కులాలకు చెందిన బీసీలను కులం పేరుతోగాని, వృత్తి పేరుతో గాని దూషించినా, సాంఘిక, ఆర్థిక బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బీసీల ధన, మాన, ప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా రూపొందిస్తున్నామన్నారు. 15 రకాల వేధింపులకు శిక్షలు రూపొందిస్తున్నామన్నారు. బీసీ మంత్రుల భేటీ వివరాలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. దేశంనే తొలిసారిగా ఏపీలో బీసీ రక్షణ చట్టం అమలు చేయబోతున్నామన్నారు. బీసీ రక్షణ చట్టం డ్రాఫ్ట్ పై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 జోన్లో ఉన్న బీసీ సంఘాలు, ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. , త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమలు చేయనున్నామని స్పష్టం చేశారు. బీసీలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.బీసీలను అన్ని రంగాల్లో ముందు నిలపాలన్నదే కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు సంకల్పమని మంత్రి సవిత తెలిపారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com